ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 26, అక్టోబరు 2025

# వర్ష ప్రభావ మండలాల్లో నిరంతర పర్యవేక్షణ


» సీఎం దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి అధికారులను వర్ష ప్రభావిత మండలాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి రాజాబాబు తీసుకెళ్లారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ వచ్చే వారం కూడా భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు సహాయక చర్యలకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమన్వయ లోపం ఉండకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు.


టీసీలో సీఎంతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పారిశుధ్య పనుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. శనివారం కలెక్టర్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మరింత దృష్టి పెట్టాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, అతిసార వంటి వ్యాధుల కట్టడికి పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమన్నారు. ఏఎన్ఎంలు కూడా ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించడంతోపాటు క్లోరినేషన్ చేశాకే తాగునీటిని సరఫరా చేయాలని సీఎస్ ఆదేశించారు.


కొత్తపట్నం తీరంలో ఎగిసిపడుతున్న అలలు

# మరో గండం

- » బంగాళాఖాతంలో అల్పపీడనం
- » రేపటికి తుఫాన్‌గా మారే అవకాశం
- » ఇప్పటికే నాలుగు రోజులుగా వర్షాలు
- » వేలాది ఎకరాల్లో పంటలపై ప్రభావం
- » మళ్లీ కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతుల్లో ఆందోళన
- » గుండ్లకమ్మ ఎనిమిది గేట్లు ఎత్తివేత
- » ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- » కలెక్టర్లతో సీఎం టెలికాన్ఫరెన్స్
- » మరింత అప్రమత్తమైన యంత్రాంగం

**జిల్లాకు మరో గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో తాజాగా ఇంకో అల్పపీడనం ఏర్పడింది. అది ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా సోమవారం నాటికి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం. ఆ ప్రభావంతో మూడు రోజులపాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ఇప్పటికే నాలుగు రోజులపాటు ముసురుపట్టి కురిసిన వానలతో జిల్లా ప్రజలు అతలాకుతలమయ్యారు. వివిధ ప్రాంతాల్లో పత్తి, సజ్జ, పొగాకు, వరి, కంది, మినుము ఇలా ఖరీఫ్‌లో సాగు చేసిన వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. శనివారం వాన ఆగడంతో రైతులు పొలాల బాట పట్టారు. నీరు బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారు.**

ఒంగోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముసురుపట్టి వరుసగా నాలుగు రోజులపాటు కురిసిన వానలతో అతలాకుతలమైన జిల్లాను మరో వాయుగుండం వణికిస్తోంది. ఈ ప్రకటన రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. బంగాళాఖాతంలో శనివారం ఉదయం వరకు ఉన్న అల్పపీడనం మధ్యాహ్నానికి బలపడి వాయుగుండంగా మారింది. విశాఖపట్నానికి ఆగ్నేయంగా 990 కి.మీ దూరంలో శనివారం సాయంత్రానికి కేంద్రీకృతమైన వాయుగుండం ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా సోమవారానికి తుఫాన్‌గా మారి రాష్ట్రంపై ప్రభావం చూపనుంది. తాజా అంచనా ప్రకారం అటు విశాఖ నుంచి ఇటు తిరుపతి వరకు రాష్ట్రంలోని తీర ప్రాంతంలోని అన్ని జిల్లాలపైనా ఇది ప్రభావం చూపనుంది. ఇప్పటికే తుఫాన్‌గా వాతావరణ శాఖ గుర్తించడంతోపాటు దీనికి మొంథాగా పేరు కూడా పెట్టారు. మంగళవారం రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నంల మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తుఫాన్ తీవ్రత కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు ఉండవచ్చు. ఈ సమయంలో ఇటు చెన్నై నుంచి మచిలీపట్నం వరకు కూడా భారీ వర్షాలు, గాలులు ఉండనున్నాయి.

### జిల్లా యంత్రాంగం అప్రమత్తం

జిల్లాలో రానున్న మూడురోజులు ప్రత్యేకించి సోమ, మంగళవారాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆమేరకు వాతావరణ శాఖ నుంచి సమాచారం అందింది. దీంతో ప్రభుత్వం నుంచి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వచ్చిన ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే గడిచిపోయిన తీవ్ర అల్పపీడనం జిల్లాపై నాలుగు రోజులు అధికంగానే ప్రభావం చూపగా ముందస్తు ఏర్పాట్లలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. అదేసమయంలో తాజా తుఫాన్ హెచ్చరికలు వచ్చాయి. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో భారీ వర్షాలు, రానున్న తుఫాన్ ప్రభావం, ముందస్తు చర్యలపై కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేశారు. తదనుగుణంగా కలెక్టర్ రాజాబాబు యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారు.

### బయటపడుతున్న నష్టం

గడిచిన నాలుగు రోజుల వ్యవధిలో కురిసిన వర్షాల కారణంగా భారీగా పంట నష్టం చోటుచేసుకుంది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలోని 21 మండలాల్లో 152 గ్రామాల్లో సుమారు 7,942 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం వర్షం తెరిపి ఇచ్చి శనివారం కూడా జల్లులు లేకపోవడంతో పొలాల్లో నీరు బయటకు పెట్టే అవకాశం ఏర్పడింది. కాస్తంత భూమి ఆరుతుండటంతో ఒకవైపు పంట నష్టాలు వెలుగు చూసే అవకాశంతోపాటు నీరు బయటకు వెళ్తుండటంతో అంతగా దెబ్బతినని పంటలు కోలుకుంటున్నాయి.

### నిండు కుండల్లా జలాశయాలు

గత నాలుగు రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాల ప్రభావం నుంచి ప్రజానీకం ఇంకా తేరుకోలేదు. అత్యధిక ప్రాంతాలలో నీటి వనరులలో ప్రవాహాలు కొనసాగుతున్నాయి. రవాణాకు ఆటంకాలు తొలగినప్పటికీ వాగులు, వంకల్లో ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. పలు ప్రాంతాల్లోని చెరువులకు కూడా భారీగా నీరు చేరింది. గుండ్లకమ్మ, రామతీర్థం జలాశయాలు నిండుకుండల్లా ఉన్నాయి. గుండ్లకమ్మలోకి 11,060 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎనిమిది గేట్లు ఎత్తి 24 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. అలాగే పశ్చిమప్రాంతంలోని వేలాది ఎకరాల్లో పంట పొలాల్లో నీరు నిలిచి ఉంది. మరోవైపు పల్లె, పట్టణం తేడా లేకుండా రోడ్లు దెబ్బతిన్నాయి. పారిశుధ్యం అధ్వానంగా మారి వ్యాధులు ప్రబలే వాతావరణం కనిపిస్తోంది. ఈ సమయంలో మళ్లీ జిల్లాపై తుఫాన్ ప్రభావంతో మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో ప్రజానీకంలో ఆందోళన నెలకొంది.

# రాజముద్రతో రెడీ

## మండల కార్యాలయాల్లో పట్టాదారు పాసుపుస్తకాలు

- » తప్పులు సరిచేసిన అధికార యంత్రాంగం
- » ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల భూములకు జగన్మోహన్‌రెడ్డి బొమ్మతో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాల స్థానంలో ప్రజాప్రభుత్వం రాజముద్రతో పుస్తకాలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. రెండు నెలల క్రితమే జిల్లాకు 72,006 పాసుపుస్తకాలు వచ్చాయి. అయితే గత ప్రభుత్వం ఇచ్చిన తప్పులతోనే వీటిని ముద్రించినట్లు ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేసి సరిచేసే ప్రక్రియను ప్రారంభించారు. ఆయా గ్రామాల వారీగా చేపట్టిన ఈ కార్యక్రమం కూడా దాదాపు పూర్తయినట్లు సమాచారం. ఇప్పటికే ఆయా పాసుపుస్తకాలు మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో నిల్వ చేశారు. మార్కాపురం డివిజన్‌కు 17,122, కనిగిరి డివిజన్‌కు 23,858, ఒంగోలు డివిజన్‌కు 31,026 పట్టాదారు పాసుపుస్తకాలు కొత్తవి వచ్చాయి. ఆయా గ్రామాల వారీగా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిగణనలోకి తీసుకొని పాసుపుస్తకాలు పంపిణీ చేసే నాటికి వాటన్నింటినీ పూర్తిస్థాయిలో పరిశీలించి చేర్పులు, మార్పులు ఉంటే సరిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ఈ పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నట్లు సమాచారం. ఆ రోజున ఆయా నియోజకవర్గాలలో మంత్రులు, శాసనసభ్యుల సమక్షంలో రాజముద్రతో ముద్రించిన పాసుపుస్తకాల పంపిణీకి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు.




# జిల్లాకు రూ.కోటి కేటాయింపు

- » అత్యవసరంగా డ్రా చేసుకొనేందుకు కలెక్టర్‌కు అనుమతి
- » ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



7

# రేపు ఒంగోలులోనే 'మీ కోసం'

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) ఈనెల 27న ఒంగోలులోనే జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేశు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ కార్యక్రమాన్ని మార్కాపురం డివిజన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున అక్కడ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. సోమవారం ఒంగోలులో జరిగే మీకోసంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలను స్వీకరిస్తామని ఆయన తెలిపారు. మార్కాపురం డివిజన్‌లోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

# బస్సుల్లో ముమ్మర తనిఖీలు

- » కర్నూలు ఘటన నేపథ్యంలో అప్రమత్తం
- » 12 కేసులు నమోదు చేసిన రవాణా శాఖ
- » 65 వాహనాలను సోదా చేసిన పోలీసులు


స్కూల్ బస్సులో అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

ఒంగోలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో బస్సు ప్రమాదం నేపథ్యంలో పోలీసు, రవాణా శాఖ అధికారులు కదిలారు. జిల్లావ్యాప్తంగా శుక్ర, శనివారాలు విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్‌ల లైసెన్స్‌లు, బస్సుల్లోని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన తనిఖీలలో 12 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. రెండు బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు లేవని, ఒక బస్సులో ప్యాసింజర్ లిస్టు లేదని, మరో తొమ్మిది బస్సులకు మెరుపు లైట్లు వినియోగిస్తున్నందున కేసులు నమోదు చేశామని చెప్పారు. తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఒంగోలులో 65 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసి వారిని హెచ్చరించి పంపించామన్నారు. శనివారం కూడా సోదాలను కొనసాగించారు. డీటీసీ సుశీల ట్రావెల్స్ బస్సులను, పోలీసులు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు.


పగిలిన పత్తి కాయల్లోకి నీరు చేరి రంగు మారిన దృశ్యం

# పత్తికి అధిక నష్టం

- » సాగు చేసిన పంటలో 31శాతానికి పైగా దెబ్బతిన్నవైనం
- » నేటికీ నీటిలోనే వేలాది ఎకరాలు
- » తాజా అంచనా ప్రకారం 152 గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు

ఒంగోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరుసగా నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలతో పత్తికి అధిక నష్టం వాటిల్లింది. వర్షం తెరపిచ్చి రెండు రోజులు గడుస్తున్నా ఇంకా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీటిలోనే ఉన్నాయి. మరోవైపు కోతదశలో ఉన్న పంటలపైనా వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయశాఖ తాజా అంచనా ప్రకారం పత్తికి అధిక నష్టం వాటిల్లనుంది. అదికూడా మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లోనే ఎక్కువ ఉన్నట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో వ్యవసాయశాఖ తాజా అంచనాల ప్రకారం 21 మండలాల్లోని 152 గ్రామాల్లో పంటలపై వర్ష ప్రభావం ఉంది. ఆ పరిధిలో 8,888 మంది రైతులకు చెందిన 7,942 హెక్టార్లలో 8 రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఒక్క పత్తి పంటే 5,838 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించారు. జిల్లాలో మొత్తం సాగైన పత్తి పంటలో సుమారు 31శాతానికి పైగా విస్తీర్ణంలో దెబ్బతింది. అందులో మార్కాపురం మండలంలో 2,780 హెక్టార్లు, పెద్దారవీడు మండలంలో 1,508 హెక్టార్లు ఉంది. అలాగే సజ్జ, జొన్న, కంది, వేరుశనగ, వరి, మినుము, మొక్కజొన్న తదితర పంటలు కూడా దెబ్బతిన్నట్లు గుర్తించారు.

వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం దెబ్బతిన్న పంటలు, వాటి విస్తీర్ణం వివరాలు ఇవీ..

| పంట పేరు | విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|
| పత్తి | 5,838.00 |
| సజ్జ | 1,712.00 |
| మొక్కజొన్న | 124.06 |
| వేరుశనగ | 94.50 |
| కంది | 80.00 |
| వరి | 52.00 |
| మినుము | 36.00 |
| జొన్న | 5.42 |
| మొత్తం | 7,942.00 |


ఒంగోలులోని రంగారాయుడు చెరువు పుట్టవద్ద పూజలు చేస్తున్న మహిళలు



## దివ్య సుందర నాగో..

నాగుల చవితి పండుగను శనివారం జిల్లావ్యాప్తంగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే నాగేంద్రుడి పుట్టల్లో పాలుపోసి పసుపు, కుంకుమ సమర్పించారు. కొందరు ఉపవాస దీక్షను ఆచరించారు. : లోపలి పేజీల్లో..

# ఒక్కరు పోటీలో ఉన్నా ఎన్నికలే!

» ఈసీ నూతన మార్గదర్శకాలు » వెల్లడించిన డీఆర్వో ఓబులేశు

ఒంగోలుకలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో ఒక్క అభ్యర్థి పోటీలో ఉన్నా ఇక నుంచి ఏకగ్రీవం లేదని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేశు వెల్లడించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం ఎన్నికల్లో ఒక్క అభ్యర్థి నామినేషన్ వేసి పోటీలో ఉన్నా ఎన్నికలు జరుగుతాయన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థి ఓటరుకు నచ్చకపోతే తన ఓటును నోటాకు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. రెండు ఓట్లు ఉన్న ప్రజలు వెంటనే ఒక ఓటును రద్దు చేసుకోవాలన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానానికి సహకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, కళావతి, సత్యనారాయణ, రవీంద్రారెడ్డి, పార్టీల ప్రతినిధులు వెంకట్రావు, డీఎస్ క్రాంతికుమార్, ఎస్‌కే రసూల్, గుర్రం సత్యం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేశు

## జాతీయస్థాయి గుర్తింపులో రైజ్ కళాశాల హ్యాట్రిక్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ మరో విశిష్టమైన మైలురాయిని అందుకుంది. రైజ్ సంస్థలోని సీఎస్‌ఈ, ఈసీఈ, ట్రిపుల్‌ఈ, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ శాఖలకు జాతీయ స్థాయి హోదా ఎన్‌బీఏ గుర్తింపును వరుసగా మూడోసారి కూడా పొందిందని కళాశాల కరస్పాండెంట్ హనుమంతరావు శనివారం తెలిపారు. దేశంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో కొద్ది కళాశాలలకు మాత్రమే ఈ గుర్తింపు లభించిందని కళాశాల కోశాధికారి శిద్దా భరత్ తెలిపారు. ఈ గుర్తింపు జూలై 2025నుంచి 2028 డిసెంబరు వరకు కొనసాగుతుందన్నారు. రైజ్ విద్యాసంస్థకు ఒక అరుదైన హ్యాట్రిక్ గుర్తింపు దక్కడంపై డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు తెలిపారు. విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే తమ కళాశాల లక్ష్యమని రాగ చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక, గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్ పేర్కొన్నారు.

## జిల్లాలో 4.9 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 4.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కొండపి 24.0, నాగులుప్పలపాడు 18.6, తాళ్ళూరు 12.6, దొనకొండ 12.0, దర్శి, పొదిలి మండలాల్లో 9.6 మి.మీ వర్షం కురిసింది. మిగిలిన ఇతర మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

## ఎయిడెడ్ టీచర్ల వివరాలు కోరిన డీఈవో

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి కోరారని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవో నెంబరు 1 ప్రకారం సర్‌ప్లస్ ఉపాధ్యాయుల వివరాలను ఎంఈవోలు గుర్తించి డిప్యూటీ డీఈవోలకు సబ్జెక్టు, క్యాడర్ వారీగా అందజేయాలని ఆర్‌జేడీ ఆదేశించారన్నారు. సీనియారిటీ జాబితా తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు.

## ఘనంగా ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్‌రెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వాలే ధ్యేయంగా ఏర్పడిన ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ వేడుకలు శనివారం ఒంగోలులోని నెక్ట్స్‌జెన్ స్కూలులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం నేర్పిస్తాయన్నారు. కేవలం తమ పాఠశాల విద్యార్థులే కాకుండా ఇతర స్కూళ్ల విద్యార్థులను కూడా ఆహ్వానించి భాగస్వాములను చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు మోడల్ జనరల్ అసెంబ్లీలో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కాపురం, గుంటూరు, ఢిల్లీ పబ్లిక్ స్కూలు, కేంద్రీయ విద్యాలయ, సెయింట్ జేవియర్స్ విద్యార్థులు, నెక్ట్స్ జెన్ స్కూలు డైరెక్టర్ అరవింద, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌ఎల్‌వీ.రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శారద, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నగర అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు అభివృద్ధి పనులను మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ మేరకు పోతురాజుకాలువ బ్రిడ్జిపై రక్షణ కంచెల నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఆర్టీసీ ఎదురు కర్నూలు రోడ్‌లో సెంటర్ డివైడర్‌ల పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులు వేగవంతం చేసినట్లు వివరించారు. రహదారుల విస్తరణతోపాటు పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు, బ్రిడ్జిపై ప్రయాణించేవారికి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఐరన్‌వాల్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈ ఐశయ్య, ఏఈ అంజిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## 28న కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ పాలవకర్గ అత్యవసర సమావేశం ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నగర అభివృద్ధితోపాటు, పలు పరిపాలన అంశాలపై చర్చ ఉంటుందని, పాలకవర్గ సభ్యులందరూ హాజరుకావాలని ఆయన ఆయన కోరారు.

## చెరువుల పరిశీలన


విప్పగుంటలో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

పొన్నలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సాగునీటి చెరువులను ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత శనివారం పరిశీలించారు. విప్పగుంట, పెదవెంకన్నపాలెం చెరువులలో నీటిమట్టం, కట్ట నాణ్యతతోపాటు అలుగులను చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులలో 10 శాతం మాత్రమే నీరు నిల్వ ఉందన్నారు. మరలా తుఫాన్ హెచ్చరిక ఉన్నందున నీరు చేరే అవకాశం ఉందన్నారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, భారతి, నారాయణ, ఆదాం, నీటి సంఘం అధ్యక్షుడు ఏడుకొండలు ఉన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత


ఎస్టీకాలనీవాసులకు సరుకులను అందజేస్తున్న సుచిత్రచౌదరి, నాయకులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అమ్మనబ్రోలు గ్రామంలోని తిరుపతయ్య ఎస్టీకాలనీ వాసులు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న దివంగత మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి సతీమణి, చవటపాలెం ఎంపీటీసీ సుచిత్రచౌదరి శనివారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కలిసి నిత్యావసర సరకులను అందజేశారు. ముప్పవరపు వీరయ్యచౌదరి యువసేన ఆధ్వర్యంలో కాలనీలోని 50 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, ఇతర సరుకులను పంపిణీ చేశారు. కాలనీలోని వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో తక్షణమే ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి నీటిని తొలగిస్తామని సుచిత్రచౌదరి తెలిపారు. ఇటీవల గ్రామంలో చినకాకాని శంకర్ కంటి వైద్యశాల ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించి 50 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా వారందరికి కళ్లజోళ్లను అందజేశారు కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ మారెళ్ల జనార్దనరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఈదర వెంకటకృష్ణారావు, వలేటి పాండురంగారావు, మిరియాల రమణ, ఈదర అమరనాథ్, ఇస్మాయిల్‌బేగ్, సుబ్బయ్యనాయుడు, కిషోర్, ఏడుగుండ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దర్శి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలకు అధిక నష్టం వాటిల్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి సంధ్యారాణి సూచించారు. శనివారం దర్శిలో జిల్లాస్థాయి శిక్షణ సందర్శన కార్యక్రమం జరిగింది. పత్తి, మిర్చి తదితర పైర్లను కాపాడుకునేందుకు పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలని సూచించారు.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్న మహిళా భక్తులు


ఉప్పుగుండూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సంతనూతలపాడులో పుట్ట వద్ద దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే నాగేంద్రస్వామి దేవాలయాలకు పెద్ద ఎత్తున మహిళా భక్తులు చేరుకొని పూజలను నిర్వహించారు. ఉప్పుగుండూరులోని శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆలయ చైర్మన్ కుంచాల నాగరాజు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, రాహు కేతు పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టలో పాలు పోశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు, బీసీసెల్ నాయకులు బి.సెల్వం, వేణుగోపాలస్వామి దేవస్థానం అధ్యక్షుడు మాగులూరి సత్యనారాయణ, వాసవీ కళ్యాణ మండపం అధ్యక్షుడు మోటుమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక మద్దులూరు రోడ్డులోని నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ సప్తమి వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. నాగులచవితి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని పుట్టలో భక్తులు పాలుపోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆదిమూలం సాయిశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు సన్నమూరి సుబ్బనాచారి, డి.రమణమ్మ, కె.శరత్‌బాబు, బి.శ్రీనివాసులు, వి.ప్రభాకరరావు, రాజేష్ పర్యవేక్షించారు. పూజల అనంతరం అన్నదానం చేశారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి డాక్టర్ స్వామి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. అందుకోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 71 మంది లబ్ధిదారులకు రూ.37.88 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా కల్పిస్తున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేస్తున్నారని చెప్పారు.

### 16నెలల్లో రూ.8కోట్లు అందజేత

ప్రజాప్రభుత్వం వచ్చాక 16 నెలల్లో కొండపి నియోజవకర్గంలోని 996 మందికి దాదాపు రూ.8కోట్ల మేర సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు ఇస్తున్న సీఎం చంద్రబాబునాయుడుకు మంత్రి స్వామి శనివారం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ఎంపీడీవో సురేష్‌బాబు



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండలస్థాయి సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి.విజయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారని, అయితే గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేయాలని చెప్పారు. అదేవిధంగా వాగులు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాల్లో అధికారులు, పాలకులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మండలంలో 6,687 పెన్షన్ లబ్ధిదారులకు ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ డబ్బులను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలుశాఖల పనితీరుపై ప్రజాప్రతినిధులు చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.రమణమ్మ, వైస్‌ఎంపీపీలు రాగమ్మ, వెంకటసులోచన పాల్గొన్నారు.

### చెరువుల పరిశీలన

కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలో ఉన్న చెరువులను పలువురు అధికారులు పరిశీలించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైనుంచి పెద్ద ఎత్తున చెరువుల్లో వర్షపునీరు చేరుతోంది. ఈక్రమంలో చెరువుల్లోకి సామర్థ్యానికి మించి నీరు చేరుతున్నాయా, కట్టలు ధృడంగా ఉన్నాయా అని పరిశీలించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ట్యాంకులను పరిశీలించారు. సంతనూతలపాడు పెద్ద చెరువును తహసీల్దార్ నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మధుసూదనరావు, అలాగే ఎనికపాడు, మద్దులూరు చెరువులను ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

# కర్నూల్‌రోడ్డులో మరమ్మతు పనులు


మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్‌బాబు

ట్రాఫిక్ మళ్లింపు పరిశీలించిన ఎస్ఐ అజయ్ బాబు

సంతనూతలపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు సమీపంలోని కర్నూల్‌రోడ్డులోని గుంతలకు మరమ్మతులు నిమిత్తం శనివారం వాహనాల ట్రాఫిక్‌ను పక్కకు మళ్లించారు. ఎండ్లూరు డొంక సమీపంలోని ట్రిపుల్ ఐటీ కళాశాల వద్ద ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కుంగిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన వర్షపునీరు కల్వర్టురుపైకి వచ్చి ప్రమాదకరంగా మారింది. ఈక్రమంలో శనివారం సాయంత్రం ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై నీరు నిలవకుండా పెద్ద పైపులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎస్ఐ అజయ్‌బాబు తన పోలీసు సిబ్బందితో ముందస్తుగా ఒంగోలు నుంచి వచ్చే వాహనాలను, కామేపల్లివారిపాలెం మీదుగా, చీమకుర్తి వైపు నుంచి వచ్చే వాహనాలను మైనంపాడు, ఎండ్లూరు మీదుగా ఒంగోలుకు ట్రాఫిక్‌కు మళ్లించారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ అజయ్‌బాబు తన సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు.

# విస్తృతంగా ట్రావెల్స్, స్కూలు బస్సుల తనిఖీలు



ఒంగోలులో ప్రైవేటు బస్సుల్లోని అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న డీటీసీ సుశీల, సూచనలు ఇస్తున్న పోలీసు అధికారులు


కళాశాల బస్సు డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులను శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్‌పత్రాలు, డ్రైవర్ లైసెన్స్‌లను పరిశీలించారు. అదేవిధంగా బస్సులో భద్రత కోసం ఉండే ఫైర్ ఎక్సిమిస్టర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు, సీటింగ్ సామర్థ్యాలను తనిఖీ చేశారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలను తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కాగా ఒంగోలులో డీటీసీ సుశీల, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పలు ట్రావెల్ బస్సులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### బస్సుల పత్రాల పరిశీలన


పేస్ కాలేజీ బస్సు పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ నాగమల్లేశ్వరరావు

టంగుటూరు (కొండపి): కర్నూలులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో మండలంలోని వల్లూరులోని పేస్ కళాశాలలో డ్రైవర్లకు ఎస్సై నాగమల్లేశ్వరరావు శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థుల రక్షణే ప్రధాన లక్ష్యంగా డ్రైవర్లు చోదన చేయాలని సూచించారు. అనంతరం కళాశాల బస్సుల ధ్రువీకరణ పత్రాలను, డ్రైవర్ల లైసెన్స్‌లు, ఇతర ఫిట్‌నెస్ పత్రాలను పరిశీలించారు.

# దాతల సహకారంతో రాజగోపురాల పునర్నిర్మాణం

● శింగరకొండ ఆలయ చైర్మన్ మురళీసుధాకరరావు

అద్దంకి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి నాలుగు వైపులా రాజగోపురాలు, ప్రాకార మండపాల పునర్నిర్మాణం చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు తెలిపారు. శనివారం శింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న సేవా టిక్కెట్‌ల ధరలు తగ్గించాలని, గోశాల నిర్మాణం చేయాలని, భక్తుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు నూతి ప్రసాద్, వెంకటరత్నం, సురేష్, పద్మజ, సుబ్బారావు, కోటేశ్వరరావు, నాగమ్మ, సునీత, వెంకటనారాయణమ్మ, చంద్రశేఖర్, కోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి


అంజనేయులు మృతదేహం

నాగులుప్పలపాడు,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కదుతున్న రైలు నుంచి జారి పడి చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అమ్మనబ్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. ఒంగోలు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి ఎగువ లైన్‌లో వెళుతున్న తమిళనాడు సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న సుమారు 40 ఏళ్ల వ్యక్తి అమ్మనబ్రోలు రైల్వేస్టేషన్ దాటి ఎల్‌సీ గేట్ వద్దకు వచ్చేసరికి జారిపడి గాయపడ్డాడు. వెంటనే 108వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదని, గాయపడిన సమయంలో తన పేరు అంజనేయులు అని చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఒంగోలు జీఆర్పీ పోలీసులకు 9440627647 సెల్‌నంబరులో సమాచారం అందించాలని ఆయన కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పీజీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని పీజీ కళాశాలల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి శనివారం విడుదల చేశారు. ఈ పరీక్షలకు వివిధ కోర్సుల్లో 1011 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 92.58శాతం ఉత్తీర్ణతతో 936 మంది పాసైనట్లు సీఈ ప్రొఫెసర్ జి.సోమశేఖర్ తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, డాక్టర్ శ్రీనివాసులు, పరీక్షల విభాగం పర్యవేక్షకుడు శివరాం తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాగుంట విదేశీ పర్యటన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఉదయం విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. చెన్నయ్ విమానాశ్రయంలో బయలుదేరి సాయంత్రానికి స్పెయిన్ దేశంలో ఉన్న బార్సిలోన పట్టణం చేరుకుంటారు. వచ్చేనెల 2వ తేదీన తిరిగి ఎంపీ మాగుంట చెన్నయ్‌కు చేరుకోనున్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పొన్నలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు పోటీలను నిర్వహించడం వలన రచన పట్ల అవగాహన, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 హరిబాబు, ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు, సీఆర్‌ఎంటీలు బాలకోటేశ్వరరావు, రాజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



నెల్లూరు బస్టాండ్‌లోని నాగేంద్రస్వామి పుట్టవద్ద పాలుపోస్తున్న యువతులు

## భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగులచవితి పండుగను శనివారం జిల్లా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఒంగోలు నగరంలో ఉదయం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో స్థానికంగా ఉన్న పుట్టల దగ్గరికి వచ్చి పాలు పోసి పసుపు, కుంకుమ సమర్పించారు. ఒంగోలు రంగారాయుడుచెరువు దగ్గర, స్కంధపురి కొండ మీద, భాగ్యనగర్, రాంనగర్, అన్నవరప్పాడు, సంతపేట సాయిబాబా మందిరం, కర్నూల్ రోడ్డు ఇలా పలు ప్రాంతాలలో ఉన్న పుట్టల దగ్గర మహిళలు పూజలు నిర్వహించారు. అలాగే నగరంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు, శివాలయాలకు సైతం మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి అక్కడ దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా మహిళలకు, ఆయా ప్రదేశాలలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా పోలీస్‌శాఖ గట్టి చర్యలు తీసుకుంది. ఇక అదేవిధంగా ఆదివారం నాగపంచమి సందర్భంగా కూడా అనేకమంది పుట్టదగ్గర పాలుపోసే అవకాశం ఉంది. ఈసారి నాగపంచమి ఆదివారంతో కలిసి రావటం విశేషం.

## జిల్లాకు రూ.కోటి అత్యవసర నిధులు

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో డ్రా చేసుకొనేందుకు కలెక్టర్‌కు అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల సమయంలో అత్యవసరంగా వినియోగించుకొనేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ. కోటి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ అత్యవసరంగా ఆ నిధులను వినియోగించుకొనేందుకు ట్రెజరీ నుంచి నిధులు డ్రా చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి జి. సాయి ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని 11 జిల్లాలకు రూ. 14 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో మన జిల్లాకు ప్రభుత్వం రూ. కోటి కేటాయించింది. ఈ నిధుల ద్వారా పునరావాస కేంద్రాలు, ఆహారం, తాగునీరు, పాలు, మెడికల్ క్యాంపులు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## గల్లంతైన డైట్ విద్యార్థి మృతదేహం వెలికితీత

- శ్రమించిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం
- అరవింద్ మృతదేహం చూడగానే ఆక్రందనలు

చీమకుర్తి,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో యర్రగుడిపాడు జంక్షన్ వద్ద ముదిగొండి వాగులో శుక్రవారం గల్లంతైన డైట్ విద్యార్థి కాకి అరవింద్(19) మృతదేహాన్ని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం వెలికితీసింది. తన ఇద్దరు మిత్రులను కాపాడి నీటిలో కొట్టుకుపోయిన అరవింద్ మృతదేహం రెస్క్యూ టీం వాగులో దాదాపు ఐదువందల మీటర్ల దూరంలో ఆచూకీ కనుగొని బయటకు తీసుకురాగానే ఆక్రందనలు వెల్లువెత్తాయి.అరవింద్ తల్లిదండ్రులు, బంధువులు, డైట్‌లో సహచర విద్యార్థులు అరవింద్ విగత జీవిగా కనిపించడంతో తట్టుకోలేకపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.సంఘటనపై పోలీసులు కేసున మోదు చేసి విచారణ జరుపుతున్నారు.



ప్రైవేటు ట్రావెల్స్ యజమానులతో మాట్లాడుతున్న ఎంవీఐ మాధవరావు

## ట్రావెల్స్ బస్సుల యజమానులు నిబంధనలు పాటించాలి

మార్కాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యజమానులు నిబంధనలను పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని మార్కాపురం మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎం.మాధవరావు హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో శుక్రవారం జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణం నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను మాధవరావు శనివారం తనిఖీ చేశారు. ఆయా బస్సుల్లో తప్పవనిసరిగా ఫైర్ సిలిండర్‌లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, గ్లాస్ బ్రేక్ హేమర్ ఉండాలన్నారు. అంతేకాక ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు తిప్పితే సీజ్ చేస్తామన్నారు. మద్యం సేవించి డ్రైవర్‌లు బస్సులు నడపరాదన్నారు. ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### స్కూల్ బస్సుల తనిఖీ

ఎస్పీ ఆదేశాల మేరకు మార్కాపురం టౌన్, రూరల్ ఎస్సైలు సైదు బాబు, అంకమ్మరావు శనివారం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సుల్లో ఉండాల్సిన వసతులను పరిశీలించారు. ముఖ్యంగా వాహనల ఎఫ్‌సీలు, ఇతర పత్రాలు తనిఖీ చేశారు. క్లీనర్ తప్పక ఉండాలన్నారు. విద్యార్థులు చేతులు బయట పెట్టకుండా మెస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్‌లు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

### పొదిలిలో..

పొదిలి :ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు ఉండాలని ఎస్ఐ వేమన ప్రైవేటు పాఠశాలల యజమానులకు సూ చించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఆటోలను తనిఖీ చేశారు.



## వరద లేకున్నా బురదతో ఇబ్బందులు

ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో వర్షాల కారణంగా వరద లేకున్నా బురదతో నిండిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల వారు ప్రయాణం చేయాలంటే చాలా గ్రామాలకు బస్సులు లేవు. ఆటోలపై ఆధారపడాలి. కానీ ఆటోల ప్రయాణానికి రోడ్ల దుస్థితి కారణంగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. త్రిపురాంతకం మండలం ఎండ్లూరివారిపాలెం నుంచి మేడపి వచ్చే దారి అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. విశ్వనాథపురం నుంచి లేళ్లపల్లి రోడ్డు కూడా అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పుల్లలచెరువు మండలం చాపలమడుగు నుంచి మిట్టపాలెం రోడ్డు చెరువులను తలపిస్తుండటంతో ప్రయాణానికి అగచాట్లు పడుతున్నారు. ఇటీవల హసనాపురం గ్రామం వెళ్లే రోడ్డుపై బురదలో ఆటో ఇరుక్కుపోయి ప్రయాణికులు కాలినడకన వెళ్లాల్సి వచ్చింది. నల్లమల నుంచి పాలుట్ల వెళ్లే గిరిజనులు అక్కడినుంచి ఎర్రగొండపాలెం రావాలన్నా జీపులతో ప్రయాణం చేయాలి. వైద్య చికిత్స కోసం వస్తున్న సమయంలో దారిలో ఇరుక్కుపోయిన జీపుతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలా మొత్తానికి వరద లేదు కానీ బురద రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



బురద బురదగా మారిన ఎండూరివారిపాలెం నుంచి మేడపి వచ్చే రోడ్డు



నల్లమలలోని పాలుట్ల నుంచి ఎర్రగొండపాలెం వస్తూ బురదలో ఇరుక్కుపోయిన జీపు



అధ్వానంగా మారిన విశ్వనాథపురం-లేళ్లపల్లి రోడ్డు

# తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

- ఒంగోలుతో పాటు డివిజన్ కేంద్రాల్లో కంట్రోలు రూముల ఏర్పాటు
- వర్షాలకు నష్టపోయిన బాధితులకు పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక
- కలెక్టర్ రాజాబాబు వెల్లడి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని కలెక్టర్ పీ రాజాబాబు వెల్లడించారు స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశుతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తీసుకున్న చర్యలతో పాటు వచ్చేవారం జిల్లాపై మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వివరించారు. నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుందన్నారు. వర్షాభావ ప్రభావిత ఆరు ఆవాస ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మంతా తుఫాన్ ప్రభావం ఈనెల 27వతేదీ నుంచి మూడు రోజుల పాటు జిల్లాపైనా ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో మూడంచెల ప్రణాళికతో యంత్రాంగం వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. తుఫాన్‌పై ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, తుఫాన్ సమయంలో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజలు ఇళ్లలోనుంచి బయటకు రావద్దని కలెక్టర్ కోరారు.

### కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోలు రూం ఏర్పాటు

ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తెచ్చేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోలు రూములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్‌శాఖ తరుపున 9440817491 నెంబరుతో కంట్రోలు రూము ఏర్పాటు చేయగా, డివిజన్ స్థాయిలో కనిగిరిలో 7893208093, మార్కాపురంలో 99857 33999, ఒంగోలులో 9281034437 నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### బాధితులకు పరిహారం

ప్రస్తుత భారీ వర్షాల వల్ల సముద్రంలో వేటకు వెళ్లకుండా మత్స్యకారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. దీని ద్వారా తమ జీవనోపాధి కోల్పోతున్నట్లు మత్స్యకారులు చెప్పారన్నారు. ఇలాంటి ఐదువేల కుటుంబాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు కూడా ఇబ్బంది పడ్డారన్నారు. వీరికి అవసరమైన ఆర్థిక సహాయం చేస్తామని, ఆమేరకు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు.

### రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి


జిల్లాలో రెవెన్యూ సమస్యలపై మీ కోసం కార్యక్రమంలో అధికంగా అర్జీలు వస్తున్నట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సమస్యల ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆన్‌లైన్‌లో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో కనిగిరి తహసీల్దార్ రవిశంకర్‌ను సస్పెండ్ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.



# పృథులగిరికి మణిహారం.. ఘాట్ రోడ్డు నిర్మాణం

- మంత్రి స్వామి చొరవతో రూ.4కోట్లు మంజూరు

మర్రిపూడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ప్రగతికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి హారతి పడుతున్నారు. సముద్ర మట్టానికి నాలుగువేల అడుగులపైన ఉన్న దేవాలయానికి చేరుకోవడానికి భక్తులు అష్టకష్టాలు పడుతున్ననేపథ్యంలో ఘాట్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఏటా ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున జరిగే బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు పృథులగిరికి తరలి వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు పాలకులను వేడుకుంటున్నారు. కొండపైన రూ.50లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి దేవాలయ ప్రగతికి బాటలు వేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పాలకమండలి సభ్యునిగా స్వామి దేవాలయ జీర్ణోద్ధరణ పనులకు రూ.25లక్షలు మంజూరు చేయించగా, ఆ నిధులతో దేవాలయ ప్రాంగణమంతా ప్రహరీ నిర్మించడంతోపాటు గర్భాలయాన్ని ఆధునికీకరించారు. మర్రిపూడి నుంచి కొండ వరకు 5 కి.మీ దూరం మట్టి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించిన మంత్రి స్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులను సాధించారు. తారు రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో మూడు కిలోమీటర్ల మేర ఘాట్ రోడ్డును నిర్మించనున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి రానున్న బ్రహ్మోత్సవాల్లోపు రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ అధికారులు ఆగమేఘాలపై చర్యలు ప్రారంభిస్తున్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణంతో భక్తులు దేవాలయానికి వెళ్లేందుకు మార్గం సులభతరం కానుంది. పృథులగిరి అటు అధ్యాత్మికంగా, ఇటు పర్యాటకంగా భాసిల్లే అవకాశం ఉంది.



పృథులగిరి కొండకు వెళ్లే మార్గం

# నల్లమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- గోడను ఢీకొన్న లారీ
- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ఘాట్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందగా క్లీనర్‌కు గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు నంద్యాల నుంచి మొక్కజొన్న కంకులతో లారీ గిద్దలూరు వైపునకు వస్తుండగా బొగదా వద్ద లారీ అదుపుతప్పి రైల్వే గోడను ఢీకొనడంతో డ్రైవర్ దూదేకుల బాలహుస్సేన్ (50) అక్కడికక్కడే మృతిచెందారు. లారీ క్లీనర్ పట్నం చిన్నయ్యకు గాయాలయ్యాయి. నంద్యాల నుంచి మొక్కజొన్న కంకులతో రాజమండ్రికి వెళ్తుండగా బొగదా సమీపంలోని పాత రైల్వే బ్రిడ్జి వద్ద లారీ అదుపు చేసుకోలేక బ్రిడ్జిని ఢీకొన్నది. దీంతో డ్రైవర్ మృతిచెందగా, క్లీనర్‌కు గాయాలయ్యాయి. అయితే అటు నంద్యాల వైపు, ఇటు గిద్దలూరు వైపు సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సుమారు 6 గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ అక్కడకు చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



బొగదా వద్ద రైల్వే బ్రిడ్జి గోడను ఢీకున్న లారీ

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగులచవితిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో, అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు నాగశిలలకు పూజలు చేసి నాగులపుట్టలో పాలు పోశారు. అర్చకులు నాగదేవతలకు వివిధ పూజలు నిర్వహించారు. నాగులచవితి పర్వదినాన్ని పలు ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శివాలయం, పోలేరమ్మ ఆలయాలలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

గిద్దలూరు : నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గ్రంథాలయం ఎదురుగా నాగమయ్య ఆలయంలో నాగ శిలలకు భక్తులకు పాలాభిషేకం చేశారు. అభయాంజనేయస్వామితోపాటు పలు ఆలయాల్లో, సమీప పుట్టల్లో పాలు పోశారు.

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లో శనివారం నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీ కోట సత్యమాంబ దేవి ఆలయం వద్ద, ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద, కోటేశ్వర స్వామి దేవాలయం వద్ద, కంభం చెరువు కట్టపై, అర్థవీడు మండలంలోని మొహిద్దీన్ పురం గ్రామ సమీపం, అర్థవీడులోని నాగులవరం పుట్టల వద్ద పూజలు చేశారు.

పెద్దారవీడు : నాగుల చవితిని శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కొత్తపల్లిలో వెలసిన నాగులపుట్ట వద్దకు మండలంతోపాటు మార్కాపురం పట్టణం నుంచి కూడా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టకు పాలుపోశారు.

బేస్తవారపేట : గ్రామాల్లో శనివారం నాగుల చవితి వేడుకలు నిర్వహించారు. భక్తులు పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి, పూజలు చేశారు.

ఎర్రగొండపాలెం రూరల్ : నాగుల చవితిని పురస్కరించుకొని దేవాలయాలు, పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. సుబ్రహ్మణ్య విగ్రహాలు, నాగ శిలలకు పాలు పోసి, కార్తీక దీపాలను వెలిగించారు.

పొదిలి : నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయం, విరాట్‌నగర్, విశ్వనాథపురంలో పుట్టలో పాలుపోసి నాగేంద్రుడికి పూజలు చేశారు. నిర్మమహేశ్వర ఆలయంలో పార్వతీ సమేత పరమేశ్వరుడిని, కామాక్షిదేవిని, శ్యామలాదేవి సమేత నాగేశ్వరస్వామిలను దర్శించుకొన్నారు.



నాగ శిలలకు పూజలు చేస్తున్న భక్తులు



సగిలేరువాగు వద్ద బందోబస్తులో ఉన్న పోలీసులు

## సగిలేరు వద్ద పహారా

గిద్దలూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా గిద్దలూరు ప్రాంతం గుండా వెళ్లే సగిలేరువాగు ప్రవహిస్తుండడంతో కొండపేట వద్ద వాగు ఉధృతి ఎక్కువగా ఉండడం వలన అర్బన్ సీఐ కె.సురేష్ పోలీసు పహారాను ఏర్పాటు చేశారు. ఎవరూ ఈతకు వెళ్లొద్దని హెచ్చరించారు.

## ఉపాధ్యాయులకు ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ తరగతులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులకు కార్యాలయంలో శనివారం ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ తరగతులను నిర్వహించారు. సమావేశంలో కన్వీనర్ పిచ్చయ్య మాట్లాడుతూ బిహార్ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ అమలు చేస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ విషయాలను సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు రామచంద్రరెడ్డి, ఆవులరాజు, బాలవెంకటేశ్వర్లు, మస్తాన్, హకీం పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు




విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గిద్దలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన రమ్యశ్రీ, నూరానీ, స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన రేవంత్ ప్రతిభ కనపరచి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత పొందారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఎంఈవో పి.నాగభూషన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

పొదిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో పదవతరగతి విద్యార్థినులు కళా ఉత్సవ్‌లో ఉత్తమ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కరిమూన్‌బీబీ శనివారం తెలిపారు. గతనెలలో మైనంపాడులో జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలలో ప్రణవి, కావ్య, శ్రావణి, ఆర్.ఎమిమా ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విజయవాడలో శుక్రవారం జరిగిన సెల్‌ఫోన్ అడిక్షన్ అనే అంశంపై రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలలో మూడవ స్థానంలో నిలిచినట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

## 1 నుంచి కార్తీక ప్రత్యేక పూజలు

గిద్దలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హైవే రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు పక్కన నవంబరు 1, 2, 3 తేదీల్లో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పోలంరెడ్డి బాలక్రిష్ణారెడ్డి తెలిపారు. నవంబరు 1వ తేదీ రాత్రి 7 గంటలకు 8 అడుగుల కృష్ణ శిల రూపంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామికి మహాశాంతి అభిషేకం, 2వ తేదీ రాత్రి 7గంటలకు 8 అడుగుల ఎత్తు గల శివలింగానికి 100 మంది హిమాలయ సాధువులతో మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకం, 3న రాత్రి 8గంటలకు అయ్యప్పస్వామి పడిపూజ, ఇదే రోజు సాయంత్రం 6గంటల నుంచి అభయ హిందూసేన వ్యవస్థాపకులు రాధామనోహర్‌దాస్ స్వామీజీచే భక్తిప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల పాటు రాత్రి 9.30 గంటలకు కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పి.బాలకృష్ణారెడ్డి, నియోజకవర్గ దేవాలయాల కమిటీ అధ్యక్షుడు చేరెడ్డి యర్రారెడ్డి తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఈ-క్రాప్‌తోనే పంటకు పరిహారం

పెద్దారవీడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేస్తేనే ఇటీవల కురుస్తున్న వర్షాలకు నష్ట పరిహారం అందుతుందని ఏవో ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో గొబ్బూరులో పంటలను వ్యవసాయ సిబ్బందితో కలిసి సందర్శించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 2006 మంది రైతులకు సంబంధించి పత్తి 1508 హెక్టార్లు, మొక్క జొన్న 20 హెక్టార్లు, మినుము 11 హెక్టార్లు, పెసర 2 హెక్టార్ల మేర నష్టం జరిగినట్లు జిల్లా అధికారులకు నివేదికను పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## శేషవాహనంపై శ్రీవారు

పొదిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామి వారు శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయ దాతలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్యహోమం, బలిహరణ పూజలు చేశారు. రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. పెద్ద ఎత్తున ప్రజలు గ్రామోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## పాఠశాలల తనిఖీ

రాచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల-1 ఎంఈవో షేక్ మైనుద్దీన్ ఆకవీడు యూపీ, చోళ్లవీడు ప్రాథమిక, స్పెషల్ పాఠశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీచర్స్, స్టూడెంట్స్ అటెండెన్స్, విద్యార్థులకు అందించిన విద్యా కానుక, రోల్, ఎస్‌ఆర్‌కే వీఎం కిట్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతున్న తీరు, పాఠశాల రికార్డుల నిర్వహణ వీటన్నింటిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నాయని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థుల

# రింగ్ బండ్‌కు మరమ్మతులు చేపట్టండి

**ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి**



తెగిపోయిన కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

రాచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెగిపోయిన దశబంధం కుంట కట్ట రింగ్ బండ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సోమిదేవిపల్లి గ్రామ సమీపంలోగల దశబంధం కుంట కట్ట తెగిపోగా శనివారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కుంట కింద దాదాపు 50ఎకరాల ఆయకట్టు ఉందని కుంటలో నీళ్లు లేకపోతే ఆయా భూముల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, తక్షణమే రింగ్ బండ్ ద్వారా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అవసరమైన నిధులు కూడా మంజూరు చేయిస్తామని, అప్పటివరకు తాత్కాలిక మరమ్మతులతో వర్షపునీరు కుంటలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాలు తగ్గుముఖం పడితే వెంటనే శాశ్వత పరిష్కార పనులకు ముందుకు వెళ్దాం అన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు ఇరిగేషన్ శాఖ డీఈ సీహెచ్ రామారావు, ఏఈలు సుధాకర్, పీ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరేష్ రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బి శేఖర్, గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కె యోగానంద్ రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బి బాలయ్య, డైరెక్టర్ కె అన్నోజి రావు, బి నారాయణ, టీడీపీ నాయకులు అంబవరం శ్రీనివాస రెడ్డి, ఎం శ్రీనివాసులు, బి నాగేశ్వర్ రెడ్డి, కె వెంకటేశ్వర రెడ్డి, ఆర్ రమణ, పి సనావుల్లా ఖాన్, ఎస్ కళ్యాణ్ రెడ్డి, జి శ్రీరాములు పాల్గొన్నారు.

**గలిజేరుగుళ్ల చెరువు అభివృద్ధికి కృషి**

బేస్తవారపేట : వర్షాలకు బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్ల చెరువుకు శుక్రవారం గండి పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శనివారం గలిజేరుగుళ్ల చెరువును పరిశీలించారు. చెరువు కింద కింద భూములు ఉన్నాయని చెరువులో నీరు లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని రైతుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మార్కాపురం ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ తేంద్ర, ఎంపీడీవో రంగనాయకులు పాల్గొన్నారు.

**చెరువులను పరిశీలించిన ఆర్డీవో**

కంభం : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడం, కొన్ని మండలాల లో చెరువులకు గండ్లు పడడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కాపురం ఆర్డీవో శివరామిరెడ్డి శనివారం చారిత్రాత్మక కంభం చెరువును పరిశీలించారు. ఇరిగేషన్ అధికారుల నుంచి ప్రస్తుతం కంభం చెరువులో ఎన్ని అడుగుల నీరు ఉంది, చెరువు నిండేందుకు ఇంకా ఎన్ని అడుగుల నీరు అవసరం అవుతుంది, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట కంభం తహశిల్దార్ కిరణ్, ఎంపిడిఓ వీభద్రాచారి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో వీరభద్రాచారి మండలం తురిమెళ్ల గ్రామ తప్పెట చెరువును పరిశీలించారు. ప్రస్తుతం చెరువులో నిండా నీరు ఉంది మళ్లీ వానలు పడితే చెరువు అలుగు పారి ఆ నీరు కంభం చెరువుకు చేరుతుందని భావిస్తున్నారు.

పెద్ద దోర్నాల : మండలంలోని చిన్న గుడిపాడు చెరువును మండల అధికారులు శనివారం పరిశీలించారు. వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రయాణికులకు రాకపోకలు ఇబ్బందికరంగా మారే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి, ఎంపీడీవో నాసర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎన్ శివ కోటేశ్వరరావు, చెరువును పరిశీలించారు.

రాచర్ల : ఇరిగేషన్ అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు కూడా చెరువులపై దృష్టిసారించాలని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని అనుములపల్లి చెరువును శనివారం ఆయన పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో చెరువుల్లో నీరు వృథాగా బయటకు పోకుండా చూడాలని ఆ విషయంలో మనం కూడా బాధ్యత వహించాలని అన్నారు.

# కల్తీ మద్యం నివారణే లక్ష్యం

**టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పెద్దారవీడులోని మద్యం దుకాణాన్ని శనివారం టీడీపీ నాయకులు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యాన్ని నివారించడానికి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సురక్ష యాప్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏ స్థాయిలోని వ్యక్తులైనా కల్తీ మద్యాన్ని ప్రోత్సహించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణదారులు సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి విక్రయిస్తున్నారా? లేదా? పరిశీలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎస్సీ హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మించాలి**

**ఎరిక్షన్‌బాబును కోరిన విద్యార్థులు**

పెద్దారవీడు పాఠశాల సమీపంలో ఎస్సీ హాస్టల్‌కు శాశ్వత భవనాన్ని నిర్మించాలని హాస్టల్ విద్యార్థులు ఎరిక్షన్‌బాబును కోరారు. ఎస్సీ హాస్టల్‌ను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్న హాస్టల్ పాఠశాల కిలోమీటర్ దూరంలో ఉన్నదని, దీంతో పాఠశాలకు వెళ్లి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎరిక్షన్‌బాబు హామీ ఇచ్చారు.

మార్కాపురం : కల్తీలేని మద్యాన్ని విక్రయించేలా చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి అన్నారు. తర్లుపాడు రోడ్డులోని రాయల్ వైన్‌షాప్ వద్ద శనివారం క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి కల్తీ మద్యాన్ని ఎలా గుర్తించాలో టీడీపీ నాయకులతో కలిసి సీఐ వెంకటరెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణాధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్ మాట్లాడుతూ ఇటీవల వైసీపీ నాయకులు మద్యం విక్రయాలపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. వారి పాలనలో కల్తీ మద్యం అమ్మి అమాయకుల ప్రాణాలు బలితీసుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నాణ్యమైన మద్యంను అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఏంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ నాలి కొండయ్య యాదవ్, టీడీపీ నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, మేడిద రంగస్వామి, ఈవీఎల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# చెక్‌డ్యాం పరిశీలన



గుండ్లకమ్మపై చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామం వద్ద గుండ్లకమ్మ నదిపై ఉన్న చెక్ డ్యాంను ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో బాలచెన్నయ్య శనివారం పరిశీలించారు. మార్కాపురం నుంచి పెద్దనాగులవరం గ్రామానికి వెళ్లే రోడ్డులో గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో చెక్ డ్యాం వద్ద, గుండ్లకమ్మ నదిలోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు. మండలంలోని వేమలకోట, తిప్పాయపాలెం, చింతగుంట్లతో పాటు పలు గ్రామాలలో నీరు చేరిన చెరువుల పరిస్థితిని పరిశీలించి నీరు వృథా కాకుండా, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు.

**శుభ్రం చేయించిన టీడీపీ నాయకులు**

మండలంలోని కొండేపల్లి వద్ద నల్లవాగులో పిచ్చిచెట్లను తొలగించి మార్కాపురం చెరువుకు వాన నీరు చేరేలా నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, బోడపాడు టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి శుభ్రం చేయించారు.

**చెరువులను పరిశీలించిన అధికారులు**

ఎర్రగొండపాలెం రూరల్ : వర్షాలకు చెరువులు, కుంటలు, కాలువలు దెబ్బతిన్నాయి. అమానిగుడిపాడు చెరువును తహసీల్దార్ డీ మంజునాథరెడ్డి, ఎంపీడీవో బండారు శ్రీనివాసులు సిబ్బందితో కలసి శనివారం పరిశీలించారు. కాలువలు, కట్టల విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ఆర్ఐ సర్దార్, వీఆర్వో పోతులూరయ్య, కార్యదర్శి రామరావునాయక్ పాల్గొన్నారు.



కందులాపురం సెంటర్లో ప్రవహిస్తున్న వాన నీరు

## ముంచెత్తిన వానలు

**రోడ్లపై నిలిచిన నీరు**

కంభం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కంభం, అర్థవీడు మండలాలను ముంచెత్తాయి. దీంతో అనేక గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నీరు వెళ్లే దారి లేక రోడ్లపైనే మోకాలు లోతు నీరు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంత గృహాలలోకి నీరు వెళ్లడంతో నివాసితులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా జిల్లాలోనే అతి పెద్దదైన కంభం అర్బన్ కాలనీలో 2వేలకు పైగా పక్కాగృహాలు ఉన్నాయి. 30కి పైగా ప్రధాన అంతర్గత రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షం నీరు పలు గృహాలలోకి వెళ్లడంతో గృహస్తులు మోటార్లు పెట్టి తమ గృహాలలోకి చేరిన నీటిని బయటకు తోడు కోవడం కనిపించింది. విషయం తెలిసిన ఎంపీడీవో వీరభద్రాచారి, కంభం సర్పంచ్ బోడయ్య కాలనీలో నీటిని బయటకు పంపేందుకు ఎక్స్‌కవేటర్‌తో రోడ్లకు ఇరువైపులా కాలువ తవ్వించారు. కందులాపురం పంచాయతీ పరిధిలోని కోటేశ్వర నగర్ వీధిలో వర్షపు నీరు మోకాటి లోతు చేరడంతో డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి ఫైర్ ఇంజన్‌తో వీధుల్లో నీటిని బయటకు తోడించారు. శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణ మార్పులతో కారు మబ్బులు కమ్మివేయడంతోపాటు రెండు గంటలకు పైగా భారీ వర్షం కురిసింది. కంభం పట్టణంలోని రావిపాడు రోడ్డు నుంచి వై జంక్షన్, కంభం బస్టాండ్, జాతీయ రహదారిపై మోకాటి లోతు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**కుదేలైన రైతులు**

కొనకనమిట్ల : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు కుదేలయ్యారు. మండలంలో శనగ, బొబ్బర్లు, కంది, పత్తి, వేరుశనగ, మిర్చి, మినుము పైర్లు వేశారు. ఆరుగాళం పండించిన పంటలు వర్షాలతో తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సిద్దవరం, నాగరాజుకుంట, మునగపాడు, వెలిగండ్ల, కొనకనమిట్ల, తదితర గ్రామాలలో మినుము, పత్తి, వేరుశనగ, బొబ్బర్లు, మిర్చి, సజ్జ పైర్లు దెబ్బతిన్నాయి. కొన్నిగ్రామాలలో వేరుశనగ పంట కోసి కుప్పలు వేశారు. వర్షాలతో కాయలు తడిసి మొలకెత్తయి. వెలిగండ్ల, మునగపాడులో పత్తి కాయలు తడిసి కుళ్లిపోయాయి. పంట చేతికందే దశలో నష్టం జరిగిందని రైతులు లబోదిబోమంటున్నారు. అధికారులు పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే, జనసేన నేతల జోక్యంతో తర్లుపాడుకు తీరిన బస్సుల కొరత

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని తర్లుపాడు మండలానికి ఆర్టీసీ బస్సులు లేక పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ హయాంలో పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజల కష్టాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో కృషి చేశారు. ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాపు, బలిజ సంక్షేమ సంఘం నాయకులు, తర్లుపాడు మండల జనసేన నాయకులు కాశీరావు ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ క్రాంతి కుమార్, నియోజకవర్గ కాపునాడు అధ్యక్షురాలు కృష్ణవేణి మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిసి బస్సుల సమస్యలు తీర్చాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డిపల్లె గ్రామానికి, తాడివారిపల్లె వరకు అదనంగా 3 ట్రిప్పులు పెంచారు. తర్లుపాడు నుంచి కంభంకు 6 ట్రిప్పులు నడిచే సర్వీస్ బస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కూలిన మిద్దె



పెద్ద దోర్నాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు దం తెల మిద్దె కూలి ఘటన మండలంలోని చిన్నగుడిపాడులో శనివారం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన జమ్మిగుంపుల లక్ష్మమ్మ మిద్దె పడిపోయింది. ఇంటిలో ఒక్క లక్ష్మమ్మ మాత్రమే ఉంటోంది. అయితే ప్రమా దం జరిగిన సమయానికి ఆమె లేరు. ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## మైక్రో ఫైనాన్స్ ఉద్యోగులపై కేసు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం గ్రామం తిరుమలగిరికాలనీకి చెందిన చేవూరి రాజశేఖర్ 117.696 గ్రాముల బంగారు ఆభరణాలు ఎర్రగొండపాలెం ఆశీర్వాదం మైక్రోఫైనాన్స్‌లో తాకట్టుపెట్టి 2023 జూన్ 12న లోను తీసుకున్నారు. మైక్రో ఫైనాన్స్ మేనేజర్ డీ చిరంజీవి, ఉద్యోగి రితీష్ నకిలీ పత్రాలను సృష్టించి, రాజశేఖర్‌కు తెలియకుండా ఆభరణాలను వేలంవేసి కాజేశారు. లోను చెల్లించి ఆభరణాలు తీసుకునేందుకు వెళ్లిన రాజశేఖర్‌కు అసలు విషయం తెలిసి ఈనెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ పీ చౌడయ్య విచారణ చేపట్టి మేనేజర్ చిరంజీవి, ఉద్యోగి రితీషపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

## 31న ఎన్జీవో సంఘం ఎన్నికలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం తాలుకా ఎన్జీవో సంఘం ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి నరేష్‌బాబు తెలిపారు. ఎన్జీవో కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి తదితర పోస్టులకు నామినేషన్లు స్వీకరిస్తారని సహాయ ఎన్నికల అధికారి జి.వెంకటేశ్వర్లు తెలిపారు.

## రక్తదానంతో ప్రాణదానం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానం అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నాయకులు రవికుమార్, శివకుమార్, వెంకటేశ్వర్లు, పవన్, మనీష్ పాల్గొన్నారు.

## శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలి

మార్కాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. జవహర్‌నగర్ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఉదయం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాంబాబు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మీర్జా షంషీర్ అలీబేగ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నారు బాపనరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సలీం, గొలమారి సత్యనారాయణరెడ్డి, కొండయ్య, చెంచిరెడ్డి, రంగారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

పీసీపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురం ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో జీవీ కృష్ణారావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతిని తెలియజేయాలన్నారు. ప్రతిరోజు సమయపాలన పాటించి పాఠశాలకు హాజరుకావాలన్నారు.

## గురుకుల పాఠశాల తనిఖీ

కనిగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల విద్యాప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, కస్తూర్భాగాంధీ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విచారించారు. టాయిలెట్స్, నీటి వసతిని అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

## పోలీసు సేవలపై అవగాహన పెంచుకోవాలి

పీసీపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్సై జి.కోటయ్య విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పోలీసు సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మంచి పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వర్షానికి సీఎస్‌పురం మండలంలో దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. వర్షానికి దెబ్బతిన్న సజ్జ కంకులను పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారంరెడ్డి రత్నారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ముండ్లమూరు, తమ్మలూరు, నాయుడుపాలెం, వేంపాడు, రామకృష్ణాపురం నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, శంకరాపురం, పోలవరం గ్రామాల్లో మధ్యాహ్నం అరగంట పాటు భారీ వర్షం కురిసింది. పసుపుగల్లు, పెదఉల్లగల్లు, పులిపాడు, కెల్లంపల్లి గ్రామాల్లో ఓమోస్తరు వర్షం కురిసింది.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

పీసీపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈఘటన శనివారం మండలంలోని పెదఅలవలపాడు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల ప్రాంతానికి చెందిన దంపతులు కారులో కందుకూరు వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో పెదఅలవలపాడు దగ్గర పాలేటి బ్రిడ్జి సమీపానికి వచ్చేసరికి ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అడ్డువచ్చింది. దీంతో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయిన కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి దూసుకుపోయింది. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు.

## చెరువుల్లో పుష్కలంగా నీరు

ముండ్లమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో ఉన్న చెరువులు సాగర్ జలాలతో నిండిపోయాయి. దీనికితోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవటంతో చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా అధికారుల ఆదేశాలమేరకు ఎంపీడీవో శ్రీదేవి, డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్, రెవెన్యూ అధికారులు శనివారం పులిపాడు చెరువు నీటిని అలుగు ద్వారా వాగుకు విడుదల చేశారు. పులిపాడు వద్ద అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కనే చెరువు ఉండటం వల్ల రాత్రుల సమయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వీఆర్‌వోలు, పంచాయతీ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు.

# భారీ వర్షాలకు అపార నష్టం

- పంట పొలాల్లో కుంటల్లా నిల్వఉన్న నీరు
- ఉరకెత్తిన మొక్కలు
- ఆందోళన చెందుతున్నరైతులు

దర్శి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు దర్శి ప్రాంతంలో పంటలకు అపారనష్టం జరిగింది. పంట పొలాల్లో కుంటలా నీరు నిల్వ ఉంది. దీంతో పైర్లు ఉరకెత్తి చనిపోతున్నాయి. రైతులు ఏం చేయాలో పాలుపోక కన్నీరుమున్నీరవుతున్నారు. దర్శి సబ్ డివిజన్‌లో సుమారు పదివేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. ఇప్పటికీ పత్తి చేలల్లో కుంటలా నీరు నిల్వ ఉంది. భూమిలో తేమ అధికమై పత్తి చెట్లు చనిపోతున్నాయి. పత్తి కాయలు పగిలే సమయంలో మూడురోజులు వరుసగా వర్షం పడటంతో పత్తి రంగు మారిపోతుంది. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంట చేతికందే సమయంలో నీటి పాలు కావటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. లేత పొగతోటలు కూడా ఉరకెత్తి చనిపోతున్నాయి. ఇప్పటికీ పొగతోటల్లో నీరు ప్రవహిస్తుంది. కొన్నిచోట్ల సజ్జ పంట కోసే సమయంలో వర్షాలు పడటంతో కంకులు తడిసిపోయి పంట దెబ్బతింది. సజ్జ కంకులు మొలకెత్తుతుండటంతో ఎందుకూ పనికిరాకుండా పోయాయి. కాపు దశలో ఉన్న బొప్పాయి, మొక్కజొన్న పంటలు కూడా కొన్నిచోట్ల దెబ్బతిన్నాయి. మరో తుఫాన్ వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెపుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. మళ్లీ వర్షాలు కురిస్తే మిగిలిన పంటలు కూడా పూర్తిగా నీటి పాలవుతాయని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టాన్ని గుర్తించి సహాయం చేయాలని కోరుతున్నారు.


బసిరెడ్డిపల్లెలో పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు


ఉరకెత్తిన లేత పొగాకు తోట

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

పీసీపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పుట్టల వద్ద పూజలు చేశారు. పుట్ట వద్ద పసుపు కుంకుమలతో నాగదేవతకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పెదయిర్లపాడులోని మల్లేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పలుకూరి సుబ్బారావు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. మహారుద్రో ఎతంలోని నవ నాగులకు పాలభిషేకం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**కురిచేడు:** నాగులచవితి వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. భక్తులు పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న నాగదేవత ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో నాగదేవతకు పూజలు చేశారు. అర్చకులు కురిచేటి సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం అమ్మవారిని అలంకరించారు.

**పామూరు:** నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక అంకాలమ్మ వీధిలోగలశ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి సమేత దేవసేన దేవస్థానం వద్ద గల నాగులపుట్ట వద్ద భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అనంతరం రాగిచెట్టు, వేపచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మదనవేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలోని నాగమయ్య దేవస్థానంలో హోమాలు నిర్వహించారు. అలాగే, మండలంలోని బొట్లగూడూరు, చిలంకూరు, వగ్గంపల్లి, కంభాలదిన్నె, బోడవాడ, కమ్మవారిపల్లి గ్రామంలోని శ్రీఅచ్చమాంబ దేవస్థానం వద్ద ఉన్న నాగులపుట్ట వద్ద భక్తులు నాగులచవితి పూజలు నిర్వహిచారు.

**ముండ్లమూరు:** మండలంలో నాగుల చవితి పండుగను పురస్కరించుకొని శనివారం భక్తులు పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పెదఉల్లగల్లు, పులిపాడు, కెల్లంపల్లి, ఈదర, మా రెళ్ళ శంకరాపురం, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, సింగన పాలెం గ్రామాల్లో పుట్టల వద్ద పూజలు నిర్వహించారు.

**తాళ్లూరు:** నాగులచవితి వేడుకలను మండళంలో ఘనంగా నిర్వహించారు. చవితి సందర్భంగా మహిళలు ఉపవాసాలు ఉన్నారు. నాగమయ్య పుట్టల వద్దకు వెళ్లి పాలతో అభిషేకాలు జరిపారు..బొద్దికూరపాడు గ్రామంలో మహిళలు అధికసంఖ్యలో నాగేంద్రస్వామి గుడి, పుట్టల వద్దకు వద్దకువెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. కార్తీక మాసం సందర్భంగా శివాలయాల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయటంతో కళకళలాడాయి.

**కనిగిరి:** నాగులచవితిని శనివారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే నాగమయ్యస్వామి పుట్టను దర్శించుకుని పూజలు చేశారు. డిగ్రీ కాలేజీలోని నాగమయ్యస్వామి పుట్ట, కలగట్ల వద్ద ఉన్న పుట్ట, పునుగోడు శివాలయంలోని పుట్ట వద్ద, దొరువు వద్ద ఉన్న పుట్ట వద్దకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.


కురిచేడులో నాగదేవత


పామూరు: పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పీసీపల్లి: మహారుద్రపీఠంలో నాగదేవత ప్రతిమలకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


ముండ్లమూరు: పెదఉల్లగల్లులో నాగమయ్య పుట్టకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## నీటి చెరువులను పరిశీలించిన ఆర్డీవో

పీసీపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మండలంలోని పలు చెరువులను శనివారం పరిశీలించారు. తలకొండపాడు సమీపంలోని పాలేటిపల్లి రిజర్వాయర్‌తో పాటు మారెళ్ల చెరువును పరిశీలించారు. చెరువుల నీటిమట్టంతో పాటు చెరువుకట్టలను, అలుగులను పరిశీలించిన ఆయన పైనుండి వచ్చే నీటి ప్రవాహాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ఉషను ఆదేశించారు. సిబ్బంది అవసరమైన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ ఉషతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


మారెళ్ల చెరువు కట్టను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

## ఈ రహదారిపై ప్రయాణం ఎలా..!

ముండ్లమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబండ గ్రామంలో ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. చినుకు పడితే ఆరహదారి బురదమయమవుతుంది. దీంతో గ్రామస్థులు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

ఎన్నో సంవత్సరాల నుంచి ఈరహదారి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. దీంతో వాహన చోదకులతోపాటు గ్రామస్థులు పొలాలకు వెళ్ళాలన్నా, వీదుల్లోకి వెళ్లాలన్నా పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వేములబండ ప్రధాన రహదారి దుస్థితి


మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధానాధికారి డాక్టర్ సంధ్యారాణి

## పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

దర్శి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలకు అధిక నష్టం వాటిల్లకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని దర్శి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానాధికారి డాక్టర్ పి.సంధ్యారాణి సూచించారు. అక్టోబరు నెలలో పంటల పరిస్థితిపై జిల్లాస్థాయి శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతింటున్న పత్తి, మిర్చి తదితర పైర్లను కాపాడుకునేందుకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపే ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధి రజనీకుమారి, ఏడీఏలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## నేడు సుబ్రమణ్యేశ్వరస్వామి తిరునాళ్ల


ముస్తాబైన సుబ్రమణేశ్వరస్వామి దేవాలయం(పుట్ట)

దొనకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపాలెం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన చెరువుకట్టపై వెలసిన శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి(పుట్ట) దేవాలయం భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలా ఇటీవల కాలంలో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది కార్తీక మాసంలో నాగపంచమి సందర్భంగా స్వామివారి తిరునాళ్ల వేడుకలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆదివారం నిర్వహించే 20వ వార్షికోత్సవ వేడుకలు దాతల సహకారంతో అత్యంత వైభవంగా జరిపేందుకు దేవాలయాన్ని సర్వాగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## నిబంధనలు పాటించని బస్సులపై చర్యలు

పామూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వాహన చట్టం నిబంధనలు పాటించని ప్రయివేట్ ట్రావెల్స్ వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పామూరు సీఐ భీమానాయక్ హెచ్చరించారు. కర్నూల్‌లో జరిగిన బస్సు దగ్ధం దుర్ఘటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పామూరులోని పలు ప్రయివేట్ ట్రావెల్స్ వాహనాలను తనిఖీ చేశారు. బస్సుల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు, డ్రైవర్‌ల లైసెన్స్‌లు, ఇతర అనుమతి పత్రాలను పరిశీలించారు. అలాగే, పాఠశాలల బస్సుల పత్రాలను తనిఖీ చేసి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ టి. కిశోర్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చప్టాపై ఇరువైపులా చిల్లచెట్లు తొలగింపు

తాళ్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-విఠలాపురం గ్రామాల మధ్యగల దోర్నపువాగు చప్టా ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను శనివారం విఠలాపురం గ్రామానికి చెందిన మేడగం సుబ్బారెడ్డి ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దీంతో నీటి ప్రవాహ ఉధృతి తగ్గింది. గతనాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోర్నపువాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. చప్టా ఇరువైపులా చెట్లు దట్టంగా పెరగటంతో పాటు తూములు పూడిపోవటంతో నీరుచప్టాపైగుండా ప్రవహిస్తుంది. చప్టా మధ్యలో వాగు ఉధృతి ఎక్కువగా ఉండి ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో విఠలాపురంకు చెందిన మేడగం సుబ్బారెడ్డి తన సొంత ఎక్స్‌కవేటర్‌తో చప్టా ఇరువైపులా గల చెట్లను తీయించారు. తూములకు అడ్డుగా ఉన్న చెట్లను తీయించి, కొంతమేర పూడిక తీయించటంతో చప్టాపై వాగు ప్రవాహం ఉధృతి తగ్గింది. దీంతో ద్విచక్రవాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి.

## చెరువుల కట్టలను పరిశీలించిన అధికారులు


లక్కవరం చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఇరిగేషన్ ఏఈ

తాళ్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాలు అధికంగా కురుస్తున్నందున చెరువుల కట్టల పటిష్టతపై ఎంపీడీవో పి.అజిత, ఇరిగేషన్ ఏఈ ఎం.సుబ్బారావులు శనివారం పరిశీలించారు. మండలంలోని బొద్దికూరపాడు, లక్కవరం, మన్నేపల్లి చెరువుల కట్టలను పరిశీలించారు. వర్షాలతో చెరువుల్లోకి నీరు అధికంగా చేరుతున్నందున కట్టలు బలహీనతగా ఉన్న అన్న విషయాలపై ఆరాతీశారు. చెరువుల కట్టల నుంచి నీరు ఉబికితే తక్షణమే గ్రామస్థులు, రైతులు, అధికారులు తగు చర్యలు చేపట్టి తమకు సమాచారం అందజేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తాళ్లూరులోని మల్లారెడ్డి చెరువు, శివరాంపురం సమీపాన గల మొగిలిగుండాల చెరువులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటలను కాపాడుకోవటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

అలాగే, ఆయా గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో అజిత సందర్శించారు. ప్రభుత్వ సర్వేలను సచివాలయ సిబ్బంది ఆలస్యం జరుగకుండా పూర్తి చేయాలన్నారు. గడువులోపు సర్వేలను పూర్తి చేయకుంటే తగు చర్యలు తప్పవన్నారు. సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించి ముఖ హాజరువేసి విధులు నిర్వహించాలన్నారు.

## స్కూల్ బస్సుల తనిఖీ

తాళ్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. బస్సులకు సంబంధించిన పత్రాలు, వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సు ఫస్ట్ ఎయిడ్ బాక్సు, ఎమర్జెన్సీ ద్వారాలను పరిశీలించారు.



రైతుబజార్‌లో నలుగురైదుగురు మాత్రమే చేస్తున్న వ్యాపారం

# రైతుబజార్‌పై వ్యాపారుల విముఖత

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో నిర్మాణం
- ఖాళీగా దుకాణాలు
- అధికారులు సర్దిచెబుతున్నా కానరాని ఫలితం

కనిగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కనిగిరిలో ట్రాఫిక్ ఇబ్బందులు దృష్ట్యా వీధి వ్యాపారుల కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక చొరవ వహించి సబ్‌రిజిస్ట్రార్ ప్రాంగణంలో రైతుబజార్ ఏర్పాటుచేశారు. ఇందులో స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. మున్సిపాల్టీ పరిధిలో కూరగాయల వ్యాపారం చేసే వారిని మున్సిపల్ అధికారులు గుర్తించి వారి పేర్లను నమోదు చేశారు. పట్టణంలోని బొడ్డుచావిడి వద్ద రోడ్డు వెంట కూరగాయల అమ్మకాలు చేస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారటంతో ఆయా ప్రాంతంలోని కూరగాయల వ్యాపారుల పేర్లను, బొడ్డుచావిడి చుట్టూ అమ్మకాలు చేసేవారి పేర్లను నమోదు చేసుకున్నారు. నమోదు చేసిన వారికి వ్యవసాయమార్కెట్‌కు వెళ్ళి దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేసి నెలకావస్తున్నా ఆ దిశగా ఎవరూ ఆసక్తి కనబరచటం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య అలాగే ఉండిపోయింది.

కాగా, రైతుబజార్ లాంఛనంగా ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా వీధి వ్యాపారులు రైతుబజార్‌లో అమ్మకాలు సాగించేందుకు ఆసక్తి చూపటం లేదు. 30 స్టాల్స్‌లో కేవలం నలుగురైదుగురు వ్యాపారులు మాత్రమే కూరగాయలు అమ్ముకుంటున్నారు. పట్టణంలోని బొడ్డుచావిడి, ఒంగోలు బస్టాండు, పామూరు బస్టాండు, గార్లపేట బస్టాండు వద్ద కూరగాయల దుకాణాలు ఉండటంతో రైతుబజార్ ఉన్న ఆ నలుగురైదుగురికి ఆశించినంత అమ్మకాలు జరుగక ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రజాశ్రేయస్సు కోసం ఎమ్మెల్యే చేసిన కృషి, ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేకుండా పోయింది. ఇప్పటికే మున్సిపల్ అధికారులు పలుమార్లు బొడ్డుచావిడి, గార్లపేట బస్టాండు, పామూరు బస్టాండు, ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న కూరగాయల వ్యాపారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. పైగా అధికారులపై వాగ్వివాదానికి దిగుతున్నారని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఐఎండీ జారీ చేసిన తుపాను హెచ్చరికల చిత్రపటం

# ముంచుకొస్తోన్న.. మొంథా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

- ఐఎండీ హెచ్చరికలు జారీ
- తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- తుపాను ప్రకటనతో రైతుల ఆందోళన
- అధికారుల అప్రమత్తం.. ముందస్తు చర్యలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారి మొంథా పేరుతో ముంచుకొస్తోంది. తుపాను ప్రభావంతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. పల్నాడు జిల్లాపైనా ప్రభావం ఉండవచ్చని అధికారులు అప్రమత్తమయ్యారు. తుపాను ప్రభావంతో జిల్లాలో 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే తరుణంలో తుపానుతో నిండా మునిగిపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి, పత్తి వంటి పంటలు కోత దశకు వచ్చిన నేపథ్యంలో నాలుగు రోజులు వర్షాలపై వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలతో నష్టపోయామని.. ముంచుకొస్తోన్న మొంథా ముంచేస్తుందని వాపోతున్నారు. పంట ఏ దశలో ఉన్నప్పటికీ తుపాను వలన అధిక వర్షపాతం నమోదైతే చేతి కొచ్చే దిగుబడులు నీటిపాలవుతాయని రైతులు ఆవేదన చెందు తున్నారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. తపాను ప్రభావంతో 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు (మిగతా 8వ పేజీలో)


కారంచేడు మండలం తిమిడిత పాడు వద్ద నీట మునిగిన పంట పొలాలు



### హార్బర్‌లో 1వ నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడుతున్న నేపథ్యంలో నిజాంపట్నం హార్బర్‌లో 1వ నెంబర్ ప్రమాదహెచ్చరికను ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈదురుగాలులు కూడా వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో వేట చేసే పరిస్థితి లేక మత్స్యకారుల బోట్లు జెట్టీలకే పరిమితమయ్యాయి.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, జేసీ భావనవశిష్ఠ

## రేపటి నుంచి 29 వరకు పాఠశాలలకు సెలవు

- తుపాను విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో భారీవర్షం, గాలులు వీచే అవకాశం ఉన్నందున 27 నుంచి 29 వరకు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఉమామహేశ్వర్, అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనాలు సరిగ్గా లేని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులను ఇళ్లకు పంపాలని ఆదేశించారు. తుపాను విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చినగంజాం, వేటపాలెం, కర్లపాలెంలో భారీవర్షాలు పడే అవకాశం ఉందన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అధికారులు యూనిట్లుగా ఏర్పడి ఎలాంటి నష్టం జరగకుండా ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. 27 నుంచి 29 వరకు అధికారులంతా సమన్వయంతో పనిచేసి తుఫాన్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఉద్యోగులు సెలవులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలన్నారు.జిల్లాలోని అధికారులు, ఉద్యోగులందరూ 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. 122 రెవెన్యూ గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో జేసీ భావనవశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

**బీచ్‌లు బంద్ : ఎస్పీ ఉమామహేశ్వర్**

తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నుంచి 29 వరకు మూడురోజులు జిల్లాలోని బీచ్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పర్యాటకులు, సముద్ర స్నానాలకు ఆచరించే భక్తులు తీరాలకు రావద్దని, ఎవరైనా వస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, నాలుగు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు బాపట్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తే పోలీసు బందోబస్తు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.



## యూరియా బస్తా రూ. 450

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

- అధిక వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరు
- పంటల సంరక్షణకు యూరియా వినియోగం
- ఒక్కసారిగా పెరిగిన డిమాండ్..
- సరఫరాలో జాప్యం.. అన్నదాతలకు శాపం

అధిక వర్షాలతో పంటలు ఉరకెత్తుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు యూరియాను వినియోగిస్తున్నారు. రైతులందరూ పంటలకు ఒకే సమయంలో యూరియా వాడాల్సిన పరిస్థితులు ఏర్పడటంతో డిమాండ్ పెరిగింది. దీనిని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.420 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పెరిగిన డిమాండ్ కారణంగా సమస్యలు తెలెత్తుతున్నాయి. ప్రైవేట్ షాపులపై పర్యవేక్షణ కొరవడడంతోనే అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎరువుల సరఫరాలో జరుగుతున్న జాప్యం రైతులకు శాపంగా పరిణమిస్తోంది.

**ఆర్‌ఎస్కేలకు నిలిచిన సరఫరా**

అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా (మిగతా 8వ పేజీలో)

# నీటి సంఘాలకు.. జీఎస్టీ బాదుడు

వైసీపీ పాలనలో ఐదేళ్లు పాడుబెట్టిన సాగర్ కాలువలను కూటమి ప్రభుత్వం బాగు చేసింది. పూర్తి స్థాయిలో పనులు జరగడంతో చివరి భూములకు సైతం సాగునీరు సరఫరా జరుగుతోంది. నీటి సంఘాల ఆధ్వర్యంలో కాలువల మరమ్మతులు నిర్వహించారు. ఈ పనులకు జీఎస్టీ విధించారు. కాంట్రాక్టర్లు చేపట్టే పనులకు ఉన్న జీఎస్టీ విధానాన్ని నీటి సంఘాలకూ అమలు చేశారు. దీంతో చేపట్టిన మర్మమతుల పనులకు రూ.4.49 కోట్లు జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో నీటి సంఘాలు గుడ్లు తేలేస్తున్నాయి. 12 శాతం జీఎస్టీని అమలు చేశారని.. దీనిని రద్దు చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి. చేసిన పనులకు నేటి వరకు బిల్లులు చెల్లించలేదని సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు.

- కాల్వల మరమ్మతులకు 12 శాతం జీఎస్టీ
- బిల్లుల చెల్లింపులోనూ జాప్యం
- రూ.37.44 కోట్ల వ్యయంతో 801 పనులు
- జీఎస్టీ వసూలు రూ.4.49 కోట్లు


మైనర్ కాలువలో పూడికతీత (పాతచిత్రం)

(పర్చూరు, ఆంధ్రజ్యోతి)

సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వానంగా ఉన్న మేజర్, మైనర్, సబ్ మైనర్ కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ.37.44 కోట్లు నిధులు విడుదల చేసింది. జలవనరుల శాఖ గుర్తించిన 801 అత్యవసర పనులను చేపట్టిన నీటి సంఘాలు పనులను పూర్తి చేశాయి. కాలువల్లో పూడిక తీత, కంప చెట్ల తొలగింపు, కట్టల పటిష్ఠత, కట్టడాల పునరుద్ధరణ వంటి పనులు చేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని నాగార్జున సాగర్ లింగంగుంట్ల, ఒంగోలు సర్కిల్ పరిధిలో 801 అత్యవసర మరమ్మతులు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో కాలువల మరమ్మతులు జరిగాయి.

**బిల్లుల్లో జాప్యం.. జీఎస్టీ శాపం**

నీటి సంఘాలు నిర్వహించిన మరమ్మతుల పనులకు జలవనరుల శాఖ అధికారులు బిల్లులు సిద్ధం చేశారు. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని నీటి సంఘాలు చెబుతున్నాయి. మరమ్మతుల వ్యయం అంచనా ల్లోనే 12 శాతం జీఎస్టీ చెల్లించే విధంగా పొందు పరిచారు. ఈ విషయం తెలియక నీటి సంఘాలు పనులు పూర్తి చేశాయి. అంచనా వ్యయం మేరకు పూర్తిగా బిల్లులు చెల్లిస్తారని అవి భావించాయి.

**ప్రభుత్వం పునరాలోచన చేయాలి**

ఏళ్ల తరబడి కాలువలకు మరమ్మతులు చేయపోవడంతో.. కొన్ని నీటి సంఘాల పరిధిలో రైతులను భాగస్వాములను చేసి వ్యయం అంచనాకు మించి పనులు చేశారు. తీరా బిల్లుల్లో జీఎస్టీ చూపించడంతో తాము తీవ్రంతా నష్టపోతామని (మిగతా 8వ పేజీలో)


గంజాయిని పరిశీలిస్తున్న ఎస్‌బీ సీఐ రాంబాబు, ఎస్‌ఐలు రవి, సరస్వతీ, ఎస్‌ఎమ్‌కే రెడ్డి తదితరులు

## పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీ

1 ప్రయాణికుడి బ్యాగులోని 21 కేజీల గంజాయి స్వాధీనం

బాపట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల రైల్వేస్టేషన్‌లో పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో ఈగల్‌టీమ్ శనివారం తనిఖీలు చేపట్టింది. ఓ వ్యక్తి బ్యాగ్‌లో 21 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రయాణికుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాంబాబు, ఎస్‌ఐలు రవి, రాజ్యలక్ష్మి, సరస్వతి, ఎస్‌ఎమ్‌కే రెడ్డి, కొండయ్యలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కడసారి చూసుకోలేక

1 విషాదంలో ధాత్రి కుటుంబ సభ్యులు 1 డీఎన్ఏ పరీక్ష అనంతరమే శరీర భాగాల అప్పగింత


ధాత్రి తల్లి వాణి

ఇంకొల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క సంతానం. ఐదేళ్ల క్రితం భర్త మృతి చెందగా రెక్కల కష్టంతో కుమార్తెను ఉన్నత చదువులు చదివించింది. మంచి ఉద్యోగంలో స్థిరపడాలని.. వివాహం చేయాలని కలలు కన్నది. అయితే ఆమె ఆశలన్నీ కర్నూలు సమీపంలో ట్రావెల్ బస్సులో బుగ్గిపాలయ్యాయి. కర్నూలులో బస్సు దగ్ధమైన ఘటనలో ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన గన్నమనేని ధాత్రి సజీవదహనమై ప్రాణాలు కోల్పోయింది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ధాత్రి దీపావళి పండుగకు హైదరాబాద్‌లో మేనమామ ఇంటికి వెళ్లి తిరిగి బెంగళూరు వెళుతుండగా బస్సు ప్రమాదంలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పూర్తిగా కాలిపోయిన దేహాన్ని గుర్తుపట్టలేకపోయారు. కనీసం కడసారి చూపునకు సైతం నోచుకోలేదని తల్లితో పాటు బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. డీఎన్ఏ పరీక్ష అనంతరం శరీర భాగాలను ఇస్తామని అధికారులు చెప్పడంతో శనివారం తల్లి వాణి, కుటుంబసభ్యులు శనివారం స్వగ్రామం పూసపాడు చేరుకున్నారు. మనోవేదనతో గ్రామానికి చేరుకున్న ధాత్రి తల్లి వాణిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. పూసపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమ, మంగళవారాల్లో ధాత్రి శరీరభాగాలను అప్పగించే అవకాశం ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.



# బర్లీ పొగాకు కొనుగోలుకు చర్యలు

1 ఎమ్మెల్యే ఏలూరితో గ్రేడింగ్ పరిశీలించిన కలెక్టర్

పర్చూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఇంకా మిగిలి ఉన్న బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలిసి కలెక్టర్ శనివా రం మండలంలోని ఉప్పుటూరులో పొగాకు మం డెలను పరిశీలించారు. రైతుల వద్ద పొగాకును నిబంధనలు లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే ఏలూరి కోరారు. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో పొగాకు దెబ్బతినే పరిస్థితి ఉందని, తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గతంలో అమ్మకుని నగదు అందని రైతులకు త్వరితగతిన చెల్లింపులు చేయాలన్నారు. పొగాకు రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఉన్న నిల్వలు, గౌడౌన్ల పరిస్థితులను మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీని అడిగి తెలుసుకున్నారు. అనం తరం కొమర్నేనివారిపాలెంలో కూలీలతో గ్రేడ్ చేస్తున్న పొగాకును పరిశీలించారు.


పొగాకు గ్రేడ్‌ను ఎమ్మెల్యేతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

**అదనపు గదులకు శంకుస్థాపన**

పర్చూరు మండలం ఉప్పుటూరులో రూ.530.60 లక్షలతో గిరిజన గురుకుల పాఠశాల(బాలుర)లో అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో కలసి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతుందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గి రిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. పనులను పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం కల్లా తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్.షంషుద్దీన్, హుస్సేన్, డీసీ చైర్మన్ పొద వీరయ్య, డీఈ సృజన తదితరులు పాల్గొన్నారు.

## అవీ..ఇవీ..

### కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి

● నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్


శిబిరంలో పాల్గొన్న వైద్యులు

పంగులూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంటి సంరక్షణలో ప్రతి వ్యక్తి తగిన జాగ్రత్తలు పాటించాలని శంకర్ నేత్రాలయ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్ అన్నారు. పంగులూరులో శనివారం రోటరీక్లబ్, శంకర్ నేత్రాలయ వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ప్రారంభించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో 25 మందికి డాక్టర్ మనోజ్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఏడుగురికి కంటి శస్త్రచికిత్స అవసరంగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో పీఆర్వో ఎం.రవి, హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, క్లబ్ కార్యదర్శి రాయిని రామారావు, పోలిశెట్టి సీతారామయ్య, గుర్రం ఆంజనేయులు, ఐ.సుబ్బారావు, పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.

### నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

అద్దంకిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ధేనువకొండ మాజీ సర్పంచ్ నలజల వెంకటేశ్వర్లు(ఇంజనీరు) జ్ఞాపకార్థం ఆదివారం ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలోని పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుండి ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు, ఎన్ఆర్ఐ నలజల నాగరాజు శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శుభం ఫౌండేషన్, శంకర కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### వ్యక్తిగత భద్రతతో ప్రమాదాల నుంచి రక్షణ

● విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

● విజేతలకు బహుమతులు అందజేసిన సీఐ


పోటీలను పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత రక్షణతోనే ప్రమాదాల నుండి భద్రంగా ఉండవచ్చని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కేజీఎం హైస్కూల్లో విద్యార్థులకు పోలీస శాఖ విధులు, 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే ఎన్ఆర్‌పీఎం హైస్కూల్లో లైంగిక వేధింపులు, భద్రతచర్యలు వాటిపై అవగాహన కల్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సీఐ వెంట శక్తి టీం ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు ప్రధానోపాధ్యాయులు సాల్మన్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

### గోశాలకు దాణా అంజేత

అద్దంకిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలోని హరిహర గోశాలకు రూ.8 వేల విలువైన దాణాను గోశాల నిర్వహకుడు సుబ్బారావుకు రోటరీ క్లబ్ సభ్యులు అందజేశారు. గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ ఆలహరి హరిప్రసాద్, రామకోటేశ్వరరావు, చప్పిడి వీరయ్య, సుబ్రహ్మణ్యం, శివయ్య, అంజయ్య పాల్గొన్నారు.

### మందుబాబులకు జరిమానా

అద్దంకి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మందిని శనివారం అద్దంకి కోర్టులో హాజరు పరిచారు. వారికి న్యాయాధికారి అఖిల రూ.43 వేల అపరాధం విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఒకరికి రూ.6 వేలు, మరొకరికి రూ.5 వేలు, మిగిలిన 8 మందికి 4 వేల రూపాయల చొప్పున న్యాయాధికారి అఖిల ఫైన్ విధించినట్లు తెలిపారు.

### 'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

● అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజులు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం మేదరమెట్లలో ఆ యన మాట్లాడుతు వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అ వకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు పాటించాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని మల్లికార్జునరావు తెలిపారు. తుఫాను తీవ్రంగా ఉన్న సమయంలో విద్యుత్ స్తంభాల కింద, చెట్ల కింద నిలబడవద్దన్నారు. వాతావరణశాఖ, జిల్లా అధికారులు ఇచ్చే సూచనలు అందరు పాటించాలన్నారు. ఏ దైన సమాచారం తెలిస్తే స్థానిక అధికారులకు తెలియజేయాలని మల్లికార్జునరావు తెలిపారు.

### ఆధార్‌కార్డుల జారీకోసం ప్రత్యేక కేంద్రాలు


తూర్పు కొప్పెరపాడులో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):పాఠశాల విద్యార్థులకు ఆధార్‌కార్డుల జారీకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల సేవలను విని యోగించుకోవాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు, అలవలపాడు సచివాలయాలలో ప్రత్యేక ఆధార్ సెంటర్ల పనితీరును ఎంపీడీవో స్వరూపారాణి శనివారం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఆధార్‌కార్డులు అందజేయనున్నట్లు తెలి పారు. ఈ కేంద్రాలు ఈనెల 29 వరకు పనిచేస్తాయన్నారు. కొండమంజు లూరు సచివాలయంలో ప్రత్యేక ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**

కొద్దిరోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలవద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో స్వరూపారాణి సూచించారు. మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం జంపని వెంకటేశ్వర్లు(జేవీఆర్), వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

బల్లికురవ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ మెంబర్ గాలి గంగాధర్‌రావు ఆర్థిక సహకారంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

● పుట్టల వద్ద పాలుపోసి విశేష పూజలు ● శింగరకొండ రామాలయం పుట్ట వద్ద భక్తుల సందడి


కడవకుదురు పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చినగంజాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మహిళా భక్తులు నాగుల చవితి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. నాగేంద్రస్వామి ఆలయాలల్లో, పుట్టల వద్ద మహిళా భక్తులు బారులు తీరారు. భక్తులు పసుపు, కుంకుమతో నాగశిలలను ఆలకరించి ప్రదక్షిణలు చేశారు. స్వామి వారి పుట్టల వద్ద సలిమిడి, పానకం, సజ్జలు, వడపప్పు, నాగేంద్రస్వామికి ప్రీతి పాత్రమైన ఆవుపాలను పోశారు, దారాలను చుట్టి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద, కడవకుదురు బస్టాండ్, నాగులచెరువుల సమీపంలో, చినగంజాం, పలు గ్రామాల్లోని పుట్టల వద్ద, ఆలయాలలో వల్లీదేవసేవ సుబ్రమణ్యేశ్వర స్వామికి అష్టోత్తర శతనామ కుంకుమార్చనలు, అభిషేకాలను నిర్వహించారు. నాగరాజ పాహిమాన్, 'నాగదేవత రక్షమాన్' అంటూ భక్తులు చేసిన స్వామి నామస్మరణలతో పుట్టల వద్ద మారుమ్రోగింది. పుట్టల వద్ద భక్తులకు అసౌకర్యం క లుగకుండా కమిటి సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. సంతరావూరు. చింతగుంపల్లి, గొనసపూడి, నీలాయపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లోని స్వామి వారి పుట్టల వద్ద మహిళా భక్తులు పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు.



భీమవరం పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు, అద్దంకిలో పూజలు చేస్తున్న మహిళలు

ఇంకొల్లు : మండలంలో శనివారం నాగులచవితి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కడవకుదురు రోడ్డులోని భీమవరం పుట్ట వద్ద భక్తులు పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి పుట్టవద్ద నాగేంద్ర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అద్దంకి : నాగులచవతిని మహిళా భక్తులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రామ్‌నగర్ పుట్టవద్ద, పోలేరమ్మ దేవాలయంలోని పుట్ట వద్ద, శింగరకొండలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలోని పుట్ట, కాకతీయ కమ్మ అన్నదాన సత్రం వద్ద ఉన్న పుట్టల వద్ద భక్తు లు పెద్ద సంఖ్యలో పూజలు చేసి పాలు పోశారు. శనివారం కావడంతో భక్తులు శింగర కొండలోని ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీ నరశింహస్వామి వార్లను దర్శించుకొని రామాలయం ఆవరణలోని సుబ్రహ్మణేశ్వరస్వామి దేవాలయంలో పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. అన్ని గ్రామాలలో మహిళలు పుట్టల వద్ద పూజలు నిర్వహించి పాలు పోశారు.

## దాతల సహకారంతో శింగరకొండ అభివృద్ధికి కృషి

ధర్మకర్తల మండలి చైర్మన్ మురళీ సుధాకరరావు


మట్లాడుతున్న ఆలయ చైర్మన్ మురళీ సుధాకరరావు

అద్దంకి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి నాలుగు వైపులా రాజగోపురాలు, ప్రాకార మండపాల పునఃనిర్మాణం చేపట్టనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు తెలిపారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాల పై చర్చించారు. ప్రస్తుతం ఉన్న సేవా టిక్కెట్ ల ధరలు తగ్గించాలని, గోశాల నిర్మాణం చేయాలని, భక్తుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణం త్వరితగతిన చేపట్టా లని తీర్మానించనున్నారు. ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు నూతి ప్రసాద్,వెంకటరత్నం, సురేష్, పద్మజ, సుబ్బారావు, కోటేశ్వరరావు, నాగమ్మ, సునీత, వెంకటనారాయణమ్మ, చంద్ర శేఖర్, కోట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## త్రివిక్రమ అగస్తేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

స్వామివార్లను దర్శించుకున్న ఏలూరి


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఏలూరి

చెరుకూరు (పర్చూరు), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వర స్వామివార్ల ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివార్లను పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు దర్శించుకొని పూజలు చేపట్టారు. ఆలయానికి చేరుకున్న ఏలూరికి ఆలయ ఆధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంతో ప్రతిష్టతను సంతరించుకున్న అలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, నాయుడు హనుమంతురావు, గ్యాస్ శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, దాసరి ఉషారాణి, షంషుద్దీన్, షేక్.జమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పరపాలేనికి బల్లకట్టు ప్రారంభం**

పర్చూరు : మండల పరిధిలోని చెరుకూరు శివారులోని ఉప్పరపాలెం గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం గ్రామం లోని కృష్ణాడెల్టా (కొమ్మమూరు) కాలువపై గ్రామస్థులు, రైతుల సౌకర్యార్థం రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బల్లకట్టును ఏలూరి స్థానిక రైతులు, అధికారులతో కలసి ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ఉప్పరపాలెం గ్రామాన్ని పూర్తి వసతులు కల్పించి మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బల్లకట్టు మీద రైతులతో కలసి కొమ్మమూరు కాలువపై ప్రయాణించారు. కార్యక్రమంలో పొదవీరయ్య, షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, నాయుడు హనుమంతురావు, దాసరి రామకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఆయాశాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ముంచుకొస్తోన్న.. మొంథా

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల పై ఆదేశాలు జారీ చేశారు. ఏర్పాట్లపై కలెక్టర్లు సమీక్షిస్తున్నారు.

దిగుబడుల వేళ ముంపు

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు ముఖం చాటేశాయి. మేలో ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత సుమారు రెండు నెలల పాటు ముఖం చాటేశాయి. ఆగస్టు నుంచి మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ఒకే రోజున 220 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే ఆగస్టు, సెప్టెంబరులో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం కొంచెం ఆలస్యంగా ఖరీఫ్ సీజన్ లో పంటల సాగుని రైతాంగం చేపట్టారు. దీంతో వరి, పత్తి తదితర పంటలు ఇంకా కోతలు చాలా చోట్ల మొదలుకాలేదు. నవంబరు మొదటి వారం తర్వాత కోతలు ఊపందుకుంటాయని అధికారులు భావిస్తూ అందుకు అనుగుణంగా ధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 2,30,000 ఎకరాల్లో వరి సాగవగా 50 శాతం కోతలకు సిద్ధంగా ఉంది. గుంటూరు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంటలు కోత దశలో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా పత్తి సాగవగా కోత దశకు చేరింది. కంది పంట కూడా వర్షాలకు ఉరకెత్తుతోంది. పత్తి, కంది, వరి పంటలకు వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. చేలల్లో పెద్దఎత్తున వర్షపు నీరు చేరి పూత, పిందె తడిసిపోయాయి. రెండు నెలల వయస్సులో ఉన్న మిర్చి మొక్కలు నీటిలో కుళ్లిపోతున్నాయి. ఎక్కువ రోజులు మొక్క నీటిలో ఉండటంతో తెగుళ్లు సోకుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి వర్షాలు తగ్గుముఖం పట్టగా శనివారం కొన్ని ప్రాంతాల్లో ఎండ వచ్చింది. దీంతో రైతాంగం కొంతమేర ఊపిరి పీల్చుకుంది. ఎలాగోలా సస్యరక్షణ చర్యలు చేపట్టి కోతలు మొదలు పెడదామనుకుంటున్న తరుణంలో మొంథా తుపాను హెచ్చరికలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అధికవర్షపాతం నమోదైతే డ్రెయిన్లు, పంట కాల్వల్లో నుంచి నీరు పొంగి పొలాల్లో ప్రవహించి రోజుల తరబడి నిలబడిపోయే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే పెట్టుబడులు ఖర్చులు కూడా రాని విధంగా పలు దఫాలుగా వర్షాలు తమను కుదేలు చేశాయని, రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు నమోదైతే పంటలు ఏమీ మిగలవనే ఆవేదనను రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

## పైపాటుపై రైతులు దృష్టి సారించాలి

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో అకాల వర్షాలతో నీళ్లు చేరడంతో రైతులు నత్రజని, పొటాష్ కలిపిన ఎరువులను పైపాటుగా పిచికారి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంలోని పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ నెలాఖరులోగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వారి వెంట స్థానిక సహాయక సంచాలకులు రత్నకుమారి, ఏవో నిర్మళాదేవీ, వీఏఏ నీలిమ, రైతులు ఉన్నారు.

**పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం : ప్రత్యేకాధికారి**

పంగులూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల కారణంగా పంటనష్టపోయిన రైతులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ అన్నారు. గత కొద్దిరోజులుగా ఎడతెరపు లేకుండా కురిసిన వర్షాల కారణంగా కొండమూరు, రేణంగివరం గ్రామాలలో దెబ్బతిన్న మినుము పైరును స్థానిక అధికారులతో కలసి ఆమె శనివారం పరిశీలించారు కోతదశకు చేరుకున్న మినుము అధికవర్షంతో పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితిని రైతులు అధికారులకు వివరించారు. రైతులు ఆందోళన చెందవద్దని, పంట పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి తగిన సాయం అందేలాచర్యలు చేపడతామన్నారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలో కొండమూరు, రేణంగివరం, ముప్పవరం, బూదవాడ,అలవలపాడు, బైటమంజులూరు, కె.వి.పాలెం, కొండమంజులూరు, తక్కెళ్లపాడు పరిసర గ్రామాలలో రెండున్నరవేల ఎకరాలలో అదికవర్షం కారణంగా మినుము పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

## నీటి సంఘాలకూ జీఎస్టీ బాదుడు!

(5వ పేజీ తరువాయి)

సదరు నీటి సంఘాల సభ్యులు వాపోతున్నారు. తాము కాంట్రాక్టర్లం కాదని, జీఎస్టీని రద్దు చేయాలని.. బిల్లుల నుంచి మినహాయించరాదని వారు కోరుతున్నారు. మినహాయించిన జీఎస్టీని ఇన్‌పుట్ బిల్లులు దాఖలు చేస్తే తిరిగి చెల్లించే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కాలువల మరమ్మతులకు ఇన్‌పుట్ బిల్లులు ఎలా ఉంటాయని నీటి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మొత్తం మీద జీఎస్టీ కోత నీటి సంఘాలకు మింగుడుపడనిదిగా ఉంది. ప్రభుత్వం జీఎస్టీ విషయంలో పునరాలోచన చేయాలని నీటి సంఘాలు కోరుతున్నాయి.

## యూరియా బస్తా రూ.450

(5వ పేజీ తరువాయి)

విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి పత్తి, మిరప, కంది పంటలు ఉరకెత్తి ఎండిపోతున్నాయి. అయా పంటలను కాపాడుకునేందుకు పొలంలో నిలిచిన నీరు బయటకు పంపి.. యూరియా పంటకు వినియోగించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు యూరియా కొనుగోలు చేస్తున్నారు. రైతుసేవా కేంద్రాలకు యూరియా సరఫరాను వారం రోజులుగా నిలిపివేశారు. అక్కడక్కడా కొన్ని సొసైటీల్లో మాత్రమే యూరియా నిల్వలు ఉన్నాయి. అధిక వర్షాల వల్ల యూరియాకు డిమాండ్ ఏర్పడడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం యూరియా బస్తా ధర రూ.266.65గా నిర్ణయించింది. అయితే కొన్ని మండలాల్లో బస్తా రూ.420 నుంచి రూ 450 వరకు విక్రయిస్తున్నారు. అధిక ధరలను నియంత్రించడంలో వ్యవసాయ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నెలాఖరు వరకు కష్టం..**

కొన్ని సొసైటీలకు సరఫరా చేసే ఎరువులు రాజకీయ అండదండలు ఉన్న రైతులకే అందుతున్నాయన్న విమర్శలున్నాయి. సొసైటీల కంటే ఆర్ఎస్‌కేల ద్వారా ఎరువులు విక్రయిస్తే అందరికి న్యాయం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకు రైతులు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేసే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలి. దీంతో ఆర్ఎస్‌కేలకు ఎరువులను సరఫరా చేస్తే పంట నమోదు పూర్తి కాదన్న వాదనను వ్యవసాయ శాఖ అధికారులు వినిపిస్తున్నారు. అప్పటి వరకు రైతులు ప్రైవేట్ వ్యాపారుల పైనే ఎరువుల కోసం ఆదారపడాల్సి ఉంది. దీనిపై వ్యవసాయ శాఖ జేడీని వివరణ కోరగా అధిక ధరకు యూరియా విక్రయిస్తే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేయడం చేశామన్నారు.. ఇప్పటికే అధిక రేట్లకు ఎరువులు విక్రయించిన ఆరు షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా అధిక రేటుకు ఎరువులు విక్రయిస్తే సమీప వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

### నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక కమఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సృజన సాహిత్య సమావేశం నిర్వహించనున్నట్లు సృజన బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 'మున్షి ప్రేమ్ చంద్ జీవితం- వ్యక్తిత్వము- సాహిత్యం' గురించి ధర్మవరపు శ్రావణ్‌కుమార్, కుందుర్తి పద్మజ రచించిన పంకజం పదనిసలు (హస్యపు కథల సంపుటి) పరిచయ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాహితీ మిత్రులు అందరు హాజరుకావాలన్నారు.

### ఆర్‌డీఎస్ పనులతో నాణ్యమైన విద్యుత్

బల్లికురవ, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో జరుగుతున్న ఆర్డీఎస్ ప్రత్యేక విద్యుత్ లైన్లతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతోందని అద్దంకి డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ మస్తానరావు తెలిపారు. శనివారం మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో ప్రత్యేక లైన్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో శిధిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించడంతోపాటు, ఆధునాతనమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు త్రీఫేస్ విద్యుత్ 24 గంటలు విద్యుత్ అందుబాటులో ఉండేలా ఈ లైన్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహం, కల్లూరి రమేష్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### చిమ్మిరిబండ వీఆర్‌వో మృతి

మార్టూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిమ్మిరిబండ వీఆర్‌వో పి.శామ్యూల్ (57) శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఆయన మార్టూరు గ్రామంలో సుందరం పొగాకు కంపెనీ సమీపంలోని ఒక ఇంటిలో నెల రోజుల నుంచి అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఇంటిలో నేలపై పడుకొని ఉన్న ఆయన్ను ఇంటి యజమాని పరిశీలించగా, అప్పటికే మృతిచెందాడు. ఈ విషయాన్ని వలపర్లలోని ఆయన బంధువులకు తెలిపారు. శామ్యూల్‌కు విపరీతంగా మద్యం సేవించే అలవాటు ఉన్నట్లు తెలిసింది. ఈ ఏడాది జనవరిలో నిజాంపట్నం మండలం నుంచి డిప్యూటేషన్‌పై మార్టూరు మండలానికి వచ్చారు. శనివారం ఉదయం తహసీల్దార్ టి.ప్రశాంతి, ఆర్ఐ అశోక్, పలువురు వీఆర్‌వోలు మృతునికి నివాళులు అర్పించారు. మృతుడు పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఆరెపల్లి ముప్పాళ్ల గ్రామానికి చెందిన వారు. మృతుని కుమారుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు.

### మొంథా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండండి

● ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచన

● కార్తీక మాసం స్నానాలు నిలిపివేత

● మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచన


ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ గండం పొంచి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు సూచించారు. శనివారం ఆయన కార్యాలయంలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో తుఫాన్‌కు సంబంధించిన రక్షణ చర్యలపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా ఈ నెల 29 వరకు సముద్ర స్నానాలకు అనుమతి లేదన్నారు. అలాగే మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలలకు వచ్చే బుధవారం వరకు సెలవులు ప్రకటించినట్లు చెప్పారు. అత్యవసరాలకు మినహా నివాసాల్లోని నుండి ప్రజలు బయకు రాకూడదని సూచించారు. వృద్ధులు, వివిధ అనారోగ్య సమస్యలున్న వారు మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విపత్కర సమయాల్లో 87126 55910కు సమాచారం అందించాలని చెప్పారు.

**కార్తీక స్నానాలు నిషేధం**


చినగంజాం : మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర తీరప్రాంతాల్లో కార్తీక మాస స్నానాలు నిషేధించినట్లు ఎస్ఐ శీలం రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్తీకమాస సముద్రస్నానాలను వాయిదా వేసుకొని తిరిగి వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే రావాలని సూచించారు.

**వరదల సమయంలో వాగులను దాటవద్దు**

అద్దంకి : తుఫాన్ ప్రభావంతో నాలుగైదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా వరద నీరు వచ్చే సమయంలో వాగులను దాటవద్దని సీఐ సుబ్బరాజు తెలిపారు. వర్షాలు పడే సమయంలో ఇళ్ల నుండి బయటకు రావద్దని, తప్పని సరి పరిస్థితులలో ప్రయాణించాల్సి వస్తే వాగులు దాటే సమయంలో జా గ్రత్తగా ఉండాలన్నారు. మండలంలో వాగులు వద్ద పలు వాగులను ఆయన పరిశీలించారు.

### గొయ్యికి తాత్కాలిక మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


భవానిసెంటర్‌లో గ్రావెల్‌తో పూడుస్తున్న గొయ్యి

అద్దంకి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో నామ్ రోడ్డు నుండి రేణింగవరం రోడ్డు కు వెళ్లే ప్రాంతం లో పెద్ద గొయ్యి ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది గా మారడంతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం రహదారి లో 'గోతులతో వాహనచోదకుల ఇక్కట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మున్సిపల్ కాంట్రాక్టర్ నాదెండ్ల సుబ్బారావు తన సొంత నిధులతో గ్రావెల్ తెప్పించి గోతులు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అదే ప్రాంతంలో తరచూ గోతులు ఏర్పడుతూ రాకపోకలకు ఇబ్బంది గా మారుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.







ఉదయగిరిలో నాగులపుట్టకు పూజ చేస్తున్న భక్తులు

# నాగేంద్రాయ నమః

● భక్తిశ్రద్ధలతో నాగులచవితి ● పుట్టల వద్ద బారులు తీరిన మహిళలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునే చన్నీటిస్నానం చేసి పుట్టల వద్దకు వెళ్లి నోము దారాలు చుట్టి వచ్చారు. అనంతరం ఒక్కపొద్దులు ఉండి, మళ్లీ పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. శైవ, వైష్ణవాలయాలన్నింటిలో నాగులుచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో యువతీ,యువకులు, కొత్త దంపతులు, నవబాలింతలు చంటిబిడ్డలతో వచ్చి నాగులకు అభిషేకాలు చేశారు. పుట్టలోని నాగేంద్రుడికి పాలు, చలివిడి ప్రసాదాలు సమర్పించారు.

రాపూరులో నాగులపుట్ట వద్ద చవితి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నెల్లూరులోని ములాపేట ధర్మరాజుల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు



## ఖజానా డీడీ గంగాద్రి ఆకస్మిక మృతి



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఖజానా శాఖ జిల్లా ఉప సంచాలకుడు (డీడీ) గంగాద్రి(61) శుక్రవారం మృతి చెందారు. ఆయన అనారోగ్య కారణంగా తిరుపతిలోని సిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మృతికి ఏపీటీఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు పీ కిరణ్ కుమార్, కార్యదర్శి నరేంద్ర, కార్యవర్గ సభ్యులు, ట్రెజరీ అధికారులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

వేణుగోపాల స్వామి ఆలయ

## పునర్నిర్మాణానికి 29న శంకుస్థాపన

చిన్నజీయర్ స్వామి రాక

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మూలాపేటలోని పురాతనమైన రుక్మిణీ, సత్య భామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాన్ని ప్రభుత్వం పునర్నిర్మిస్తోంది. రూ.16.75కోట్లతో పునఃనిర్మాణ పనులకు ఈనెల 29వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా జరగనుంది. శంకుస్థాపన సందర్భంగా ఆలయం వద్ద 28వతేదీ ఉదయం 8 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యా హవాచనం, వాస్తు హోమం, ప్రవేశ బలి, మంగళహారతి, సాయంత్రం 6గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, రక్షాబంధన్, అధివాసం, హోమం జరగనున్నాయి. 29న ఉదయం 8గంటలకు మహా కుంభారాధన, నిత్యహోమాల అనంతరం ఉదయం 11.18గంటలకు శంకుస్థాపన జరగనుంది. స్వామిజీ రాక సందర్భంగా దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆలయ సహాయ కమిషనర్ జంజనం శ్రీనివాసరావు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

## ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా

● తెల్లవారుజాము నుంచి రవాణాశాఖ తనిఖీలు

● కేసుల నమోదు... పలు సర్వీసుల రద్దు

● ప్రయాణికులకు నగదు వాపస్

● ఖాళీగా మినీ బైపాస్ రోడ్డు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో శనివారం తెల్లవారుజాము నుంచి జిల్లావ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు ప్రైవేటు బస్సులపై దాడులు నిర్వహించారు. జిల్లా మీదుగా ప్రయాణిస్తున్న పలు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పదుల సంఖ్యలో బస్సులు నిబంధనలు పాటించడం లేదని తేలింది.

● కేసుల నమోదు

డీటీసీ బీ. చందర్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో తేజ టూర్స్ ట్రావెల్స్, గ్రీన్‌లైన్ ట్రావెల్స్, విక్రమ్ పెంచలనాయుడు, కావేరి ఎంటర్‌ప్రైజెస్, కావేరి టూర్స్, ట్రావెల్స్, ఎస్ ఖాజాచౌదరి ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి, ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు తరలించారు. అత్యవసర ద్వారం మూసేసిన బస్సులపై 11 కేసులు, డ్రైవర్ వెనుక రెండో డ్రైవర్‌కు బెర్త్ ఏర్పాటు చేసిన 28 బస్సులపై కేసులు, ఫైర్ పరికరాలు లేని రెండు వాహనాలపై, బస్సు ముందు అద్దం పగిలిన రెండు బస్సులపై కేసులు నమోదు చేశారు. పడుగుపాడు సమీపంలో అధికారులు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. అనంతరం నగరంలోని మినీబైపాస్‌లో నిలిపిఉన్న పలు ట్రావెల్స్ బస్సులను తనిఖీలు చేసి వాటిపై కూడా కేసులు నమోదు చేశారు.

● పలు ట్రావెల్స్ బస్సుల రద్దు

జిల్లా మీదుగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖ తదితర నగరాలకు వెళ్లే పదుల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను శనివారం రద్దు చేశారు. అశిత, సీఎస్‌ఆర్, లక్కీ బస్సులను రద్దు చేయగా, వాటి ప్రయాణికులకు నగదు వాపస్ ఇచ్చారు. రోజూ ప్రైవేటు బస్సులతో రద్దీగా ఉండే నెల్లూరులోని మినీ బైపాస్‌రోడ్డు ఖాళీగా కన్పించింది. ట్రావెల్స్ బస్సుల్లేక ప్రయాణికులు ఆర్టీసీని ఆశ్రయించారు.



కోవూరు-ఇనమడుగు సెంటర్‌లో ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

## విధుల్లోకి పీహెచ్‌సీ వైద్యులు

● 22 రోజుల తర్వాత ఆరోగ్య కేంద్రాలు కళకళ

● డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ● డాక్టర్ల సమ్మె విరమణ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీల) వైద్యులు శనివారం విధుల్లోకి చేరారు. 22 రోజుల తర్వాత వైద్యుల రాకతో పీహెచ్‌సీలన్నీ కళకళలాడాయి. ఈనెల 3 నుంచి తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో ప్రభుత్వం పలుదఫాలుగా వారితో చర్చలు జరిపింది. సానుకూలంగా స్పందన రాకపోవడం వైద్యులు తమ సమ్మెను కొనసాగించారు. అయితే శుక్రవారం జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో సమ్మె విరమించి విధుల్లో చేరారు.

### సమ్మె విరమించాం..

తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో శనివారం నుంచి పీహెచ్‌లకు వెళుతున్నాం. రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. 22 రోజులపాటు ఎంతో మంది రోగులు పీహెచ్‌సీలకు వచ్చి వైద్యులు లేక వెనుతిరిగిన మాట వాస్తవమే. కానీ తప్పనిసరి పరిస్థితిలో సమ్మె చేశాం.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## బడిలో సభ

● పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ

● వచ్చేనెల 26న రాజ్యాంగ దినోత్సవానికి ఏర్పాట్లు

● మూడు దశల్లో పోటీల నిర్వహణ

● నియోజకవర్గానికి ఒక్కరి చొప్పున విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో మాక్ అసెంబ్లీ నిర్వహణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా మాట్లాడేందుకు రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. నవంబరు 26న అమరావతిలో రాష్ట్రస్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహణకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా, జిల్లాలోని పాఠశాలల్లో మూడు దశల్లో పోటీలను నిర్వహిస్తున్నది.

● ప్రతిభ కనబరిస్తే అసెంబ్లీలోకి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే ఎమ్మెల్యేలుగా మాక్ అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం కలగనున్నది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. మూడు దశల్లోనూ విజేతలుగా నిలిస్తే మాక్ అసెంబ్లీలో పాల్గొనవచ్చు. మండల స్థాయిలో 'పౌరహక్కులు-పౌరుల బాధ్యతలు' అనే అంశంపై వ్యాసరచన, 'మానవ అభివృద్ధి-చట్టాల రూపకల్పన' అనే అంశంపై వక్తృత్వం, స్వాతంత్ర్య ఉద్యమంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన ముగ్గురు విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ రూపకల్పన వెనుక చరిత్రపై వ్యాసరచన, వికసిత్ ఏపీపై వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన ఆరుగురిని ఎంపిక చేస్తారు. వీరికి భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు నిర్వహించి ఒకరిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తారు. నియోజకవర్గానికి ఒకరు చొప్పున మొత్తం 175 మంది విద్యార్థులు రాష్ట్రఅసెంబ్లీలో పాల్గొంటారు.



### అన్నీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహణ

జిల్లాలో అన్నీ ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో వర్షాల కారణంగా ఆయా పాఠశాలల్లో పరిస్థితులకు అనుకూలంగా విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తాం. అయితే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వారిచ్చిన సమయానికి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తాం. జిల్లాలోని ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు సమాచారం అందించి విద్యార్థులను ఎంపిక చేయాలని ఆదేశాలిచ్చాం. ఎంపిక చేసిన ప్రతీ ముగ్గురిలో ఒక బాలిక కచ్చితంగా ఉండాలి. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారికి నవంబరు 24న రిజిస్ట్రేషన్, 25న అసెంబ్లీ నియమావళిపై శిక్షణ, 26న అమరావతి వేదికపై స్టూడెంట్స్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారు.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, డీఈవో



జలదంకి : గోపన్నపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఊళ్లవాగు



వరికుంటపాడు శివాలయం సమీపంలో ఎక్స్‌కవేటర్ సాయంతో వాగు దాటుతున్న గొర్రెల కాపరులు

## వదలని వాన

● కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు, ఇంకొన్ని చోట్ల భారీ వర్షం

● పొంగుతున్న వాగులు, వంకలు

● నిండుకుండల్లా చెరువులు

● వర్షాలతో ప్రజల అవస్థలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో శనివారం జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 0.9 మి.మీగా నమోదైంది. అత్యధికంగా కందుకూరులో 10 మి.మీ, అత్యల్పంగా సీతారామపురంలో 3 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా పోర్టు బ్లెయిర్‌కు 440 కి.మీ దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ తెలిపింది. రానున్న రెండు, మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

● పొంగుతున్న వాగులు, వంకలు

**జలదంకి :** మండలాన్ని వర్షం వీడడం లేదు. శనివారం ఉదయం 2గంటలపాటు జలదంకి, జమ్మలపాలెం, ఎల్‌ఆర్ అగ్రహారం గ్రామాల్లో భారీవర్షం కురిసింది. కురుస్తున్న వర్షాలకు తిమ్మసముద్రం, చోడవరం, రామవరప్పాడు, గట్టుపల్లి గ్రామాల్లో సాగుచేసిన మినుము, పెసర తదితర పైర్లు ఉరకెత్తాయి. మండలంలోని చెరువులన్నీ నిండుకుండల్లా మారాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

### వీర్లగుడిపాడుకు రాకపోకల బంద్

**సంగం :** మండలంలోని వీర్లగుడిపాడుకు పెన్నా వరదతో శనివారం రాకపోకలు బంద్ అయ్యాయి. బొగ్గేరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం ముందు ఉండే కలుజుపై నీళ్ల ప్రవహిస్తున్నాయి. బొగ్గేరు వరదకు పెన్నా వరద తోడవడంతో నీళ్ల గ్రామాన్ని చుట్టుముట్టాయి. దీంతో గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ గ్రామానికి బయలుదేరి వెళ్లారు.



వరికుంటపాడు : సచివాలయంలోకి చేరిన వాన నీరు

విద్యార్థులు పాఠశాలలలకు వెళ్లేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. వరిసాగు రైతులు విత్తనాలు, యూరియా కోసం దుకాణాలకు పరుగులు తీస్తున్నారు.

● ఉరుములు, మెరుపులతో వర్షం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. వరికుంటపాడు సచివాలయంలోకి మోకాలిలోతు వర్ష పు నీరు చేరడంతో విధులు నిర్వర్తించడం ఉద్యోగులకు కష్టంగా మా రింది. శివాలయం ప్రాంతంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో సర్పంచు దిలీప్‌కుమార్ గొర్రెల కాపరులను ఒడ్డుకు చేర్చేందుకు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల సమీపంలోనూ ఇలాంటి పరిస్థితే రాగా గ్రామస్థులు విద్యార్థులను సురక్షితంగా వాగు దాటించారు.

● సోమశిల అవుట్‌ఫ్లో 63,460 క్యూసెక్కులు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. శనివారం ఉదయం 55,981 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, సాయంత్రానికి 59,571 క్యూసెక్కులుగా నమోదైంది.వరద హెచ్చుతగ్గులుగా సాగుతుండగా దిగువకు గేట్ల ద్వారా 63,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 69 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు.

● కండలేరులో నీటి నిల్వ 59.530 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం పూర్తి స్థాయి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.530 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1540 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 4900 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

● గండిపాళెంలో పది అడుగులు

ఉదయగిరి : గండిపాళెం జలాశయం నీటిమట్టం శనివారానికి పది అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పేర్కొన్నారు. పైతట్టు ప్రాంతాల నుంచి పిల్లాపేరు, దున్నపోతుల వాగు నుంచి వరద ప్రవాహం వస్తుండటంలో నీటిమట్టం పెరిగే అవకాశముందని ఆయన తెలిపారు.

● పెన్నాలోకి లక్ష క్యూసెక్కుల ప్రవాహం

సంగం : సోమశిల వరద జలాలతోపాటు బీరాపేరు, బొగ్గేరు నుంచి శనివారం పెన్నానదికి లక్ష క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11.8 అడుగులకు చేరింది. సెక్షన్ అధికారులు బ్యారేజ్‌కి వస్తున్న నీటి ప్రవాహాన్ని వచ్చినట్లే గేట్లు ఎత్తి దిగువకు విడదుల చేస్తున్నారు.

● రాళ్లపాడులో 19.4 అడుగులు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం తగ్గిపోయింది.దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం 19.4 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో నీరు నిండుగా ఉండడంతో ఆయకట్టు రైతులు వరినారుమళ్ల సాగుకు సిద్ధమవుతున్నారు.

## వరద బాధితులకు ఉపయోగపడుతుందా..?

● కలెక్టర్ పాఠశాల పరిశీలన

కోవూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : వరదలు సంభవిస్తే బాధితుల్ని తరలించేందుకు వీలుగా మండల పరిధిలో ఎంపిక చేసిన పాఠశాల గదులను కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం సాయంత్రం పరిశీలించారు. పెన్నానది పొర్లు కట్టలు ధ్వంసమై వరదలు సంభవిస్తే పోతిరెడ్డిపాళెంలోని మండల పరిషత్ పాఠశాలకు బాధితులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సహాయక కార్యక్రమాల తీరును కలెక్టర్‌కు తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య వివరించారు.



### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 130 |
| స్కిన్ చికెన్ | 236 |
| స్కిన్‌లెస్ | 260 |

కోడిగుడ్ల ధర (100) : 560

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,860
వెండి కిలో ధర రూ. 1,54,000
వెండి ఒక గ్రాము రూ.160.00

## 3వ విడత డిగ్రీ ప్రవేశాలకు నేడు రిజిస్ట్రేషన్

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మూడవ విడత డిగ్రీ ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 26 తేదీ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీన మార్పులకు అవకాశం ఉంటుందని, నవంబరు 1న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు 4న కళాశాలలో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

## యూరియా పంపిణీ

జలదంకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్నవరం రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీవాణి, సిబి రిజర్వాయరు అధ్యక్షుడు పూనూరు భాస్కర్ రెడ్డి, టీడీపీ యువనేత పూనూరు రామకృష్ణారెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్‌పై విద్యార్థులకు అవగాహన

కొండాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీస్టేషన్‌పై సెంట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ మాల్యాద్రి శనివారం అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల దినంలో భాగంగా పోలీసుల విధులు, ఫిర్యాదుల నమోదు, వైర్‌లెస్ సెట్లు, స్టేషన్‌లో నిర్వహించే రికార్డులు, లాకప్, తుపాకీ వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కందుకూరు క్రీడాకారులు

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26, 27 తేదీలలో కడప జిల్లా రైల్వేకోడూరులో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు కందుకూరుకు చెందిన బాలుర విభాగంలో ఎస్కే షంషజామ, బాలికల విభాగంలో బి.లక్ష్మీఅక్షర, ఎస్కే సమీహాలు ఎంపికయ్యారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని, కోచ్ అఖిల్‌ను ఆయన అభినందించారు.

## ప్రత్యేక ఆధార్ కేంద్రాల పరిశీలన

వలేటివారిపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు, వలేటివారిపాలెం హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఎంపీడీవో శంకర్‌రావు శనివారం పరిశీలించారు. ఈ కేంద్రాలు ఈనెల 31వ తేది వరకు నిర్వహిస్తునట్లు తెలిపారు.

## ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సీతారామపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కేంద్రాలను మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మస్తాన్‌వలి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రారంభించిన ఆధార్ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, ప్రవీణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



కావలి : నాగుల పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నాగుల చవితి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సబ్‌కోర్టు సెంటర్, జనతాపేట, ఉత్తరంపేట రామాలయం, రామమూర్తి పేట, ముసునూరు, కావలి చెరువు తదితర ప్రాంతాలలో ఉన్న పుట్టల వద్ద భక్తులు తెల్లవారుజాము నుంచి పూజలు చేసేందుకు బారులు తీరారు. భక్తులు చలివిడి, సజ్జల నానపాలు, బెల్లంను ప్రసాదంగా పంచి పెట్టారు.

● **కావలి రూరల్ :** మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు పుట్ట మందిరాలకు చేరుకుని పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రస్వామి కి ప్రీతి ప్రాయమైన కోడి గుడ్లు, పాలు, చలివిడి పిండి నైవేద్యాలుగా సమర్పించారు.

● **వలేటివారిపాలెం :** మండలంలో మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు చేసి పాముల పుట్టల వద్దకు వెళ్లి నోముల దారాలు, నువ్వులు చలిపిండి పెట్టి పుట్టలకు దారాలు చుట్టి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఉపవాసాలు ఉండి కంకణాలు ధరించి పూజలు చేశారు.

● **లింగసముద్రం :** మండలంలోని ఆర్ఆర్ పాలెం పంచాయతీ గొల్లపాలెంలో పుట్ట వద్దకు లింగసముద్రం, జంపాలవారిపాలెం, వాకమళ్లవారిపాలెం, పెంట్రాల, కందుకూరు, గుడ్లూరు, కావలి తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో వచ్చి నాగదేవత పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. పుట్ట వద్దకు వచ్చిన మహిళలకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

● **అల్లూరు :** మండలంలో మహిళలు నాగేంద్రుడి పుట్టల వద్దకు చేరుకొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పుట్టల చుట్టూ దారాలు చుట్టి కోరిన కోర్కెలను తీర్చే దైవంగా నాగేంద్రుడికి మొక్కులు తీర్చుకున్నారు.

● **బిట్రగుంట :** బోగోలు బజారు కూడలిలోని నాగుల పుట్ట, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు నాగవరపమ్మ ఆలయ సమీపంలో, ఇబ్రహీంపేట మఠం వద్ద పూజలు నిర్వహించారు. బిట్రగుంట షిరిడీ శేషసాయి మందిర ఆవరణలోని జంటనాగుల శిలల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఓమోస్తరు వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

జలదంకి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్లవాగులో గల్లంతై మృతి చెందిన దంపూరు మల్లికార్జున కుటుంబాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం మృతుడి భార్య గోవిందమ్మకు రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం తరుపు న మరింతసాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట తెలుగుయువత మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, నాయకులు మునగాల వెంకటేశ్వరరెడ్డి, తిరుపతి ఉన్నారు.

## రూ.9.78 కోట్లతో మాలకొండ అభివృద్ధి

వలేటివారిపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయం అభివృద్ధికి రూ.9,78,11,426 మంజూరైనట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

● మండలంలోని మాలకొండలో మహా అన్నదాన సత్రం సమీపంలో నిర్మించనున్న పోలీస్‌అవుట్ పోస్టుకు ఆలయ డీసీ చంద్రశేఖర్, ఎస్ఐ మరిదినాయుడుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల నుంచి రూ.5,66,180 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కార్మికుల మోటారు సైకిల్ ర్యాలీ

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పట్టణంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు సాగింది. యూనియన్ కార్యదర్శి టీ.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు వై.రవి, పీ.శ్రీను, సీపీఐ నాయకులు దమ్ము దర్గాబాబు, ఎం.వెంకటేశ్వర్లు, చేవూరు కొండయ్య, గుంజి శ్రీను, రాజేష్, వినోద్ పాల్గొన్నారు.

## పోలీసులకు రెయిన్ కోట్ల బహూకరణ

కావలి(టౌన్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ దాతృత్వంతో 200 మంది పోలీసులకు శనివారం రెయిన్ కోట్లు బహూకరించారు. వీటిని డీఎస్పీ కార్యాలయం ఆవరణలో డీఎస్పీ శ్రీధర్ పోలీసు అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, పీ.శ్రీకాంత్, సునీల్, రామకృష్ణ, చక్రీ, మధు పాల్గొన్నారు.

## యాప్‌లపై మెప్మా సిబ్బందికి అవగాహన

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా సిబ్బందికి వాట్సప్ సర్వీసెస్, ప్రజ్ఞాయాప్, పురమిత్ర యాప్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైవింగ్‌హుడ్ ప్రమోషనల్ సెల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఐబీ అకయ్య, డీఆర్పీ జయశ్రీ, డీజీ లక్ష్మి, మున్సిపల్ మేనేజరు ఫణికుమార్ పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాల ఏర్పాటు

కలిగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్, భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు, చిన్న అన్నలూరు, వెంకన్నపాలెం యూపీ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అధికారులు, సర్పంచులు తరలించాలని కోరారు. ముందుగా లోతట్టు ప్రాంతాలను సందర్శించి భారీ వర్షాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది దీక్షితులు, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** భారీవర్షాలు, తుపానులకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అన్నారు. బోగోలు మండలం తాటిచెట్లపాలెం తీరప్రాంతంలో రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలను గుర్తించారు. ఆయన వెంట ఆర్ఐ రామకుమారి ఉన్నారు.

● **అల్లూరు :** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతాల్లోని తుఫాన్ షెల్టర్లను ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని పలు సురక్షిత ప్రాంతాలు, తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

కావలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఖైదీలు నేరప్రవృత్తికి దూరంగా సత్ప్రవర్తన కలిగి ఉండాలని కావలి అడిషనల్ ఫస్టక్లాస్ జ్యుడిషయల్ మేజిస్ట్రేట్ విక్రమసింహ తెలిపారు. కావలి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌జైలులో శనివారం ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఖైదీల కేసుల పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించనున్నట్లు తెలిపారు. వారికి అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కావలి ఎడవల్లిలో మంత్రి ఆనం పర్యటన



మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, టీడీపీ నాయకులు

ఏఎస్ పేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావలిఎడవల్లి గ్రామంలో ఆదివారం దేవదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్బూరి రమేష్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన సంగం సిఐ వేమారెడ్డితో కలసి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామి పథకం ద్వారా పనులు కల్పించాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు కోరారు. శనివారం పామూరుపల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల ఎంపికకు గ్రామసభ నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాయతీ పరిధిలో అవసరమైన శాశ్వత పనులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు తెల్లగొర్ల సుశీల, ఏపీవో ఆజంఖాన్, టీడీపీ నాయకులు తెల్లగొర్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆటో కార్మికుల ర్యాలీ

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏటీఎస్ సెంటర్లకు వ్యతిరేకంగా సీఐటీయు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఆత్మకూరు పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య తెలిపారు. శనివారం ఆయన ఆటో కారికుల యూనియన్ నాయకులతో కలిసి ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి మహేష్, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



సంగం: నాగశిలలకు పూజలు చేస్తున్న మహిళలు

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినం సందర్భంగా శనివారం ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, నాగేంద్రపురం, కాశీనాయన ఆశ్రమం, కొలగాని రామయ్యసత్రం, జ్యోతినగర్, ఎల్ఆర్‌పల్లి, చెరువు, తదితర ప్రాంతాల్లో ఉన్న నాగుల పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథస్వామి దేవస్థానం, కాశీనాయన ఆశ్రమంలోని నాగశిలల వద్ద పూజలు చేశారు.

●**సంగం:** స్థానిక శివాలయంలోని నాగశిలలకు, కోలగట్ల పెన్నానది ఒడ్డున నాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగుల పుట్టకు మహిళలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

●**ఏఎస్‌పేట:** ఏఎస్ పేటతో పాటు అనుమసముద్రం, పెద్దహబ్బీపురం, జమ్మవరం, చిరమన, హసనపురం తదితర గ్రామాలలో శనివారం నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయం పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

●**ఉదయగిరి:** నాగుల చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని సంతానలక్ష్మీ, నగిరితోటలో ఉన్న నాగులపుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టి పుట్టలో పాలు పోశారు. మండలంలోని గండిపాళెం, వెంకట్రావుపల్లి, అప్పసముద్రం, కుర్రపల్లి బీసీ కాలనీ, శకునాలపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గండిపాళెం, వెంకట్రావుపల్లి, గుడినరవ, మసీదుపల్లి, బిజ్జంపల్లి తదితర గ్రామాల్లో సైతం పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు.

●**దుత్తలూరు:** నాగులచవితి పర్వదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం నాగారప్పమ్మ శిలలు, పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

●**వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** స్థానిక వైకుంఠపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నాగులచవితి, కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లోని ఆలయాలు, పుట్టల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

●**సీతారామపురం:** మండల కేంద్రంలోని గ్రామ దేవత అంకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగేంద్రస్వామి క్షేత్రంలో నాగుల చవితి వేడుకలు శనివారం నిర్వహించారు. భక్తులు నాగదేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి



ఆర్టీసీ కార్మికులకు దుస్తులు అందజేస్తున్న నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులు అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన ఆత్మకూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోలో పనిచేస్తున్న 26 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రెయిన్‌కోట్, ఆఫ్రాన్ కలిగిన కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్, బిజెపి సీనియర్ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, బిజెపి నాయకులు నలిశెట్టి జగదీశ్, నలిశెట్టి శ్రీనివాసులు, డిపో మేనేజర్ ఎం శివకేశ్‌యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ (మెకానికల్) ఎం బాబురావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికీ పక్కాగృహాల మంజూరు

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పీఎంఏవై గ్రామీణ పథకం కింద అర్హులకు పక్కాగృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ శరత్ తెలిపారు. శనివారం మండలంలోని అశ్వనిపురం ఎస్టీ కాలనీలో ఆయన స్థానిక టిడిపి నేతలతో కలిసి అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయుటకు మండలంలో 21 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఎంపీడీవో, హౌసింగ్ ఏఈని నియమించారన్నారు. పీఎంఏవై గ్రామీణ పథకం కింద అర్హులైన లబ్ధిదారులు సచివాలయాల పరిధిలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో నాయకులు లబ్ధిదారులకు పథకం గురించి వివరించి అర్హులు పేర్లు నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు.

## దెబ్బతిన్న వరిపైరు పరిశీలన



దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అనంతసాగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతాళపల్లి, ఉప్పలపాడు, గోవిందమ్మపల్లి, పాతదేవరాయపల్లి గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించింది. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో శైలజాకుమారి పాల్గొన్నారు.

## ఈకేవైసీ చేయించుకుంటేనే ఉపాధి పనులు : ఏపీడీ

సీతారామపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ ఈకేవైసీ చేయించుకుంటేనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఉదయగిరి ఏపీడి మృదుల అన్నారు. ఆమె శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లా డుతూ నిర్ణీత గడువులోగా ఈకేవైసీ చేయించుకోని వారికి ఉపాధి హామీ పని కల్పించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్యామల, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు కొత్త జగదీష్, సుమన్‌బాబు, సుబ్బారెడ్డి, నారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.